www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 63 | శనివారం | 9 అక్టోబర్, 2026

ఫైటర్ జెట్ నడిపిన థాయ్ రాణి!

2

ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్

2

- 97% ఓటింగ్.. 33,973 మంది ఓటు
- రాష్ట్రవ్యాప్తంగా 115 కేంద్రాల్లో పోలింగ్
- 17న అధికారికంగా ఫలితాల ప్రకటన

స్టాక్ మార్కెట్‌కు మళ్లీ జోష్!

7

- ఒక్కరోజే 879 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 1.30 శాతం లాభంతో 22,520కి నిఫ్టీ
- ఐటీ షేర్ల ర్యాలీ.. తగ్గిన ముడిచమురు ధరలు

నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం

2

- అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుల పరిరక్షణకు కృషికి గుర్తింపు
- ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా సేవలు

ఢిల్లీలో హైఅలర్ట్!

సీజేపీ నిరసనకు పోలీసుల బ్రేక్.. జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు అనుమతి నిరాకరణ

- 20 వేల మందికిపైగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత • కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనలు రద్దు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతాపార్టీ, పలు విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ వద్ద నేడు తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కేవలం మూడ్రోజుల ముందు అంటే అక్టోబర్ 7నే దరఖాస్తు సమర్పించారని పోలీసులు తెలిపారు. గతసారి ఆందోళనల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన చరిత్ర కూడా ఉందని స్పష్టంచేశారు. శాంతిభద్రతల దృష్ట్యా న్యూఢిల్లీ అంతటా బీఎన్ఎన్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు.

2

ఓట్ల చోరీపై రాష్ట్రపతికి ఇండియా కూటమి ఫిర్యాదు

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే

- ఎస్ఐఆర్ నిలిపివేయాలని విజ్ఞప్తి
- 13.30 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలి
- బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలని కోరిన నేతలు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల్లో అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఈసీ కలిసి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశాలపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ప్రియాంకా గాంధీ తదిత రులు మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీకి సంబంధించిన అంశాలను రాష్ట్రపతికి వివరించామని రాహుల్‌గాంధీ తెలిపారు. ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయో ఆధారాలు అడిగారని, ఓట్ల చోరీపై ఆలోచించి చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చారని చెప్పారు. ఎన్నికలను బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించాలని కోరినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ప్రజలకు తెలుసని, సీఈసీ కార్యాలయం నుంచే ఈ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీలో మోదీ కీలక పాత్ర పోషిస్తుండగా, అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ దాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్రపతికి వినతిపత్రం అందజేసి ఓట్ల చోరీకి సంబంధించిన వివరాలను తెలియజేశామని ఖర్గే చెప్పారు. ఈ అంశంపై సంబంధిత వర్గాలతో మాట్లాడతానని రాష్ట్రపతి తెలిపినట్లు వెల్లడించారు. హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. బీజేపీ ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను తారుమారు చేసిందని తరువాయి 2లో..

ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలి

రాజధాని హైదరాబాద్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

2

- రద్దీ ప్రాంతాల్లో పీఆర్‌టీఎస్ ఏర్పాటుకు కసరత్తు
- ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని నిర్దేశం
- ముంబయిలో వినియోగిస్తున్న సాంకేతికతపై అధ్యయనం చేయండి
- క్యూర్ పరిధిలో పనుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌లో రవాణా వ్యవస్థ మెరుగుదలకు సీఎం ఆదేశాలు

సర్ అక్రమాలపై విచారణ జరపాలి

2

- సీఈసీ రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్ల తొలగింపు జరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఈసీ కార్యాలయం ఎదుట నిరసనకు బీఆర్ఎస్ పిలుపు

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

2

- 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ పునఃసర్వే
- ఏడు జోన్లుగా రాష్ట్ర విభజన.. పర్యవేక్షణకు 14 మంది అధికారులు
- నవంబర్ చివరికి తొలి దశ పూర్తి.. ఏడాదిన్నరలో మొత్తం సర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- అధికార పక్షానికి రక్షణ కవచంగా మారొద్దు
- సర్‌పై హరీశ్‌రావు ఫైర్

2

హైస్పీడ్ రైల్ ఎలైన్‌మెంట్లు ఖరారు కాలేదు

- హైస్పీడ్ రైల్ ఎలైన్‌మెంట్లు ఖరారు కాలేదు
- మూడు కారిడార్ల మార్గం అధ్యయనంలోనే ఉంది
- రాష్ట్రాలకు భూసేకరణ ప్రతిపాదన పంపలేదు
- కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: హైస్పీడ్ రైల్ కారిడార్ల కోసం భూసేకరణ చేయాలని కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు ప్రతిపా దనలేవీ పంపలేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరా బాద్–చెన్నై, హైదరా బాద్–బెంగళూరు, హైదరాబాద్ –పుణె–ముంబయి.. ఈ మూడు హైస్పీడ్ రైలు కారి డార్లకు సంబంధించిన ఎలైన్ మెంట్లపై ప్రస్తుతం అధ్యయనాలు కొనసా గుతున్నాయని తెలి పారు. కిషన్‌రెడ్డి దిల్లీలోని రైల్ భవన్‌లో అశ్విని వైష్ణవ్‌తో శుక్రవారం సమావేశ మయ్యా రు. ఈ వివరాల్ని కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే ఎక్స్‌లో వేర్వేరుగా పోస్టు చేశారు. హైదరాబాద్–బెంగళూరు సహా మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఎలైన్‌మెంట్లకు తరువాయి 2లో..

బండి సాయి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

2

- పోక్సో కేసుపై ప్రసారాలు నిలిపివేయాలని ఆదేశం
- సంబంధిత కంటెంట్ తొలగించి, డిజిటల్ రికార్డులు భద్రపరచాలి
- ప్రభుత్వాలకు నోటీసులు

నేటి నుంచి 9రోజులు పూల పండగ

2

- ప్రత్యేక లోగో రూపొందిస్తున్న ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల ఏర్పాట్లు
- 18న రాజధానిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

రాష్ట్ర సంస్కృతికి ప్రతీక, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ శనివారం ప్రారంభం కానుంది. రాజధాని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వేడుకలను ఈ నెల 18 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు.



ప్రతి ఇంటికీ పాంచజన్యం తీసుకెళ్లండి

2

- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి
- శ్రేణులకు టీఆర్ఎస్ చీఫ్ కవిత పిలుపు



ఓట్ల చోరీపై రాష్ట్రపతికి ఇండియా కూటమి ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు.ముఖ్యంగా ఇండియా కూటమి ప్రధాన డిమాండ్లు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి. సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన 13.30 కోట్ల మంది పేర్లను వెంటనే తిరిగి చేర్చాలి. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు సమర్పించిన గత రెండేళ్ల అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి.రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఇండియా కూటమి నేతలు విజ్ఞప్తి చేశారు.

ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ముగిసింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 97 శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 115 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 34,889 మంది ఓటర్లకుగాను 33,973 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గ్రేటర్‌లో 98 శాతం పోలింగ్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా 98 శాతం పోలింగ్ నమోదుకాగా, కరీంనగర్‌లో 97 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో ఏ యూనియన్ విజయం సాధిస్తుందనే దానిపై అర్ధరాత్రికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విజేతపై ఈ నెల 17న అధికారిక ప్రకటన వెలువడనుంది.

హైస్పీడ్ రైల్ ఎలైన్‌మెంట్లు ఖరారు కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి తెలంగాణలో క్షేత్ర స్థాయిలో చేసిన మార్కింగ్ పనులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. చాలామంది రైతులు తనను కలుస్తున్నారని కిషన్‌రెడ్డి రైల్వే మంత్రికి వివరించారు. తొలుత సూర్యాపేటతో కలిపి ప్రాథమిక ఎలైన్‌మెంట్ ఉండగా తర్వాత మార్చారని.. తమకూ హైస్పీడ్ రైలు కావాలంటూ ఆ జిల్లా నుంచి ప్రజలు వచ్చి కలుస్తున్నారని తెలిపారు. భూసేకరణ అంశంపై ఆందోళనతో ఉన్న రైతులు.. పోలీసు అధికారిపై కారంపొడి చల్లిన సంఘటన కూడా చోటుచేసుకుందని చెప్పారు. మూడు కారిడార్ల ఎలైన్‌మెంట్ అధ్యయనాల పురోగతిని రైల్వే మంత్రి వివరించారని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎలైన్‌మెంట్ ఖరారైన తరువాతే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు, రైతులకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కేంద్రం ఖారారు చేయకుండా రైతుల నుంచి భూములను సేకరిస్తే అది చట్టవిరుద్ధమవుతుందని పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ పాంచజన్యం తీసుకెళ్లండి

ప్రజానావ,హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతమైన 'పాంచజన్యాన్ని' ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో రైతులకు అన్యాయం చేస్తున్న దళారుల వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం ప్రశ్నించిందని కవిత తెలిపారు. దీంతో ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు రైతులకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఏడాది పొడవునా పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం బతుకమ్మ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగను ఆడపడుచులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఈ భేటీలో పార్టీ సీనియర్ నాయకులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్ అక్రమాలపై సుప్రీంకోర్టు విచారణ జరపాలి

ప్రజానావ, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కోరారు. శుక్రవారం 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు.భారత రాజ్యాంగానికి మించినది ఏదీ లేదని, ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కును హరించడానికి వీల్లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక వ్యక్తిని కాపాడేందుకు 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును బలహీనపరిచే చర్యలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజ కవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నేడు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులోఢిల్లీకి విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. సుమారు 125 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ సర్వేను పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. తొలి దశలో 2,768 గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ఇప్పటివరకు 245 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశను పూర్తి చేయాలని, మొత్తం సర్వేను ఏడాదిన్నరలో ముగించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం సర్వే పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.భూ సర్వే పనులను వేగవంతం చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పటిష్ఠం చేసేందుకు రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించారు. రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఒక్కో జోన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో లైసెన్స్‌డ్ సర్వేయర్‌తోపాటు జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బంది ఉంటారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఎకరాలు, ఎన్ని సర్వే నంబర్లలో పనులు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి? అనే వివరాలను సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా భూముల హద్దులు, రికార్డులను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మళ్లీ వివాదాలు తలెత్తకుండా సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వే పనులను రాష్ట్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే వివరాలు, రోజువారీ పురోగతి, పనిచేస్తున్న బృందాలు, రోవర్ల వినియోగం, వాటి లొకేషన్ వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించనున్నారు.రీసర్వే పేరుతో ప్రజల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేసినా, వారిని ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలి

ప్రజానావ, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు అవసరాల కు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని నిర్దేశించారు. ప్రజా రవాణా, రహదారుల అనుసంధానం, శుద్ధి చేసిన నీటి పునర్వి నియోగంపై శుక్రవారంఆయన సమీక్ష నిర్వహించారు.

మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లకు అనుసంధానం

నగరంలో ఎక్కువ మంది రాకపోకలు సాగించే ప్రాంతాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా పీఆర్‌టీఎస్ ఉండాలని సీఎం సూచించారు. మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లకు అనుసం ధానించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్‌టీఎస్ వ్యవస్థలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్గాల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కేబీఆర్ పార్కు చుట్టూ పన్‌వే విధానంతో ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యుటిలిటీల తరలింపును త్వరగా పూర్తి చేసి, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు.

ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచాలి

నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు చేపట్టిన ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముంబయి వంటి నగరాల్లో పైవంతెనల నిర్మాణాన్ని ఏడాదిలోనే పూర్తి చేస్తున్నారని, అక్కడ అనుసరిస్తున్న సాంకేతికత, నిర్మాణ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.హైదరాబాద్–ముంబయి బుల్లెట్ రైలు మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు నిర్దేశించారు. శంకర్‌పల్లి–చేవెళ్ల మధ్య ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణతో పాటు కొత్త రహదారుల నిర్మాణానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం

శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్ నీటి వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు శుద్ధి చేసిన నీటిని అందించేలా పనులు చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎత్తైన భవనాల నిర్మాణం, ల్యాండ్‌స్కేపింగ్, పార్కుల్లోనూ ఈ నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వివిధ శాఖల మధ్య సమన్వయం

క్యూర్ చట్టం అమలులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్‌బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.
ఈ సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా, మెట్రో) ఎన్‌వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రోరైలు అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి, వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

ప్రజానావ, హైదరాబాద్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటి ఎన్నికల సంఘం (ఈసీ) అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంగా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఓట్ల తొలగింపుతో నమ్మకం సన్నగిలింపు

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలతో ఎన్నికల సంఘం పనితీరుపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరు, కమిషనర్ల నియామకాలపై తలెత్తుతున్న ప్రశ్నలు రాజ్యాంగ వ్యవస్థ పునాదులను బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైతే సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. రాజ్యాంగంలోని 324, 325, 326 అధికరణాలు స్వేచ్ఛాయుత, నిష్పక్ష పాత ఎన్నికల నిర్వహణకు ప్రాధాన్యమిస్తాయని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో హైఅలర్ట్!

న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతాపార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి,పలు విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ వద్ద ఇవాళ తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కేవలం మూడ్రోజుల ముందు అంటే అక్టోబర్ 7నే దరఖాస్తు సమర్పించారని పోలీసులు తెలిపారు. గతసారి ఆందోళనల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన చరిత్ర కూడా ఉందని స్పష్టంచేశారు. శాంతిభద్రతల దృష్ట్యా న్యూఢిల్లీ జిల్లా అంతటా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. నిరసనల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉండటంతో 20 వేల మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించినట్లు సమాచారం. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లను రద్దు చేసుకుని భద్రతా పరిస్థితులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీతో పాటు పొరుగు రాష్ట్రాల్లో పరిస్థితిని ఆయన రెండ్రోజులుగా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం

ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్ వద్దకు చేరుకునే అవకాశముండటంతో దిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆందోళనకారుల కదలికలను పర్యవేక్షించేందుకు సీసీటీవీ కెమెరాలతో పాటు ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) కెమెరాలను ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద భద్రతను పెంచారు. నిరసనల్లో ఆందోళనకారుల ముసుగులో నేరస్థులు చొరబడకుండా భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులపైనా నిఘా ఉంచాయి.

57 మెట్రో స్టేషన్ల మూసివేతకు ప్రతిపాదన

మూడు రోజుల పాటు నిరసనలు జరిగే అవకాశం ఉందన్న అంచనాలతో ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని మెట్రో రైల్ కార్పొరేషన్‌ను పోలీసులు కోరినట్లు సమాచారం. శనివారం న్యూదిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ల మధ్య కొన్ని గంటల పాటు రైళ్ల రాకపోకలను నిలిపివేసే అవకాశముందని తెలుస్తోంది. అయితే ఈ చర్యలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

సీఈసీ నివాసం వద్ద జడ్+ భద్రత

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద జడ్+ భద్రత కల్పించారు. అదనపు భద్రతా సిబ్బందిని కూడా మోహరించారు. మరోవైపు, ఢిల్లీలో నిరసనల్లో పాల్గొనేందుకు వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ రైల్వే స్టేషన్లలో పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ ఆరోపించింది.

ఫైటర్ జెట్ నడిపిన థాయ్ రాణి!

- సోలో ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సుథీదా
- భార్య సాహసాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన రాజు వజ్రలాంగ్‌కోర్న్

భూటాన్: సాధారణంగా రాజకుటుంబ సభ్యులు విలాసవంతమైన జీవనశైలికి, కట్టుదిట్టమైన భద్రతకు పరిమితమవుతుంటారు. అయితే థాయ్‌లాండ్ రాజదంపతులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రాజ్య బాధ్యతలను నిర్వర్తిస్తూనే సాహసోపేతమైన విమానయానంలోనూ తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారు. ఇప్పటికే రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్ స్వయంగా విమానం నడిపి విదేశీ పర్యటనకు వెళ్లగా.. తాజాగా రాణి సుథీదా యుద్ధవిమానాన్ని నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. విమానయానంలో కఠిన శిక్షణ పొందుతున్న రాణి సుథీదా తాజాగా సింగిల్ సీట్ జేఏఎస్ 39సీ గ్రిపెన్ ఫైటర్ జెట్‌లో సోలో ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. థాయ్‌లాండ్‌లోని సూరత్ థాని ప్రావిన్స్‌లో ఉన్న వింగ్–7 వైమానిక స్థావరం నుంచి ఆమె ఈ ప్రయాణాన్ని చేపట్టారు. ఈ సాహసయానాన్ని రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఫ్లైట్‌ను విజయవంతంగా ముగించిన అనంతరం రాణిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అరుదైన ఘట్టానికి సంబంధించిన వీడియోను థాయ్ రాజకుటుంబం తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకుంది. దీంతో ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

భూటాన్ పర్యటనలోనూ..

గతేడాది భూటాన్ పర్యటన సందర్భంగా రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్ రాజకుటుంబానికి చెందిన బోయింగ్ 737–800 విమానాన్ని స్వయంగా నడిపారు. ఆ సమయంలో రాణి సుథీదా కో–పైలట్‌గా వ్యవహరించారు. రాజు గతంలో థాయ్ సైన్యంలో కెరీర్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఎఫ్–5, ఎఫ్–16 యుద్ధవిమానాలతో పాటు బోయింగ్ 737–400 విమానాన్ని నడిపేందుకు అర్హత సాధించారు.రాణి సుథీదాకు కూడా విమానయాన రంగంలో విశేష అనుభవం ఉంది. 2010లో తొలిసారిగా పైలట్‌గా పనిచేసిన ఆమె.. ఇప్పటివరకు సుమారు 1,188 గంటల పాటు విమానాలను నడిపిన అనుభవాన్ని సంపాదించారు. తాజాగా ఫైటర్ జెట్‌లో సోలో ఫ్లైట్‌ను పూర్తి చేయడంతో ఆమె సాహసోపేతమైన ప్రయాణంలో మరో కీలక మైలురాయిని అధిగమించారు.

బండి సాయి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

ప్రజానావ, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారమవుతున్న కంటెంట్‌పై న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేయవద్దని మీడియా సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు, సోషల్ మీడియా ఖాతాదారులను ఆదేశించింది.

పరువుకు భంగం కలుగుతోందని పిటిషన్

తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా ఖాతాలు కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

మీడియా ట్రయల్ చేస్తున్నారని వాదనలు

భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి ప్రసారం చేస్తూ మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించి డిజిటల్ ఆధారాలను భద్రపరిచేలా ఆదేశించాలని కోరారు.

గూగుల్, మెటా, ఎక్స్‌కు ఆదేశాలు

వాదనలు విన్న ధర్మాసనం.. కేసుకు సంబంధించిన కంటెంట్‌ను ప్రసారం చేయవద్దని ఆదేశించింది. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ సంస్థలు సంబంధిత కంటెంట్‌ను తొలగించి, డిజిటల్ రికార్డులను భద్రపరచాలని సూచించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖలు, తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, సోషల్ మీడియా సంస్థలతో పాటు పలువురు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది.

నవీ పిళ్లైకి నోబెల్‌శాంతి పురస్కారం

కేప్ టౌన్: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి దక్షిణాఫ్రికాకు చెందిన భారత మూలాలున్న నవనీతమ్ 'నవీ' పిళ్లై ఎంపికయ్యారు. శాంతి స్థాపన, అంతర్జాతీయ చట్టాల ప్రోత్సాహానికి ఆమె చేసిన కృషిని గుర్తిస్తూ నార్వే నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించినట్లు కథనంలో పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ స్థాయిలో నవీ పిళ్లై విశేషంగా కృషి చేశారు. ఆమె పూర్వీకులు తమిళనాడు నుంచి దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. నవీ పిళ్లై తల్లిదండ్రులు శాంతమ్మ నాయుడు, నారాయణస్వామి నాయుడు.నవీ పిళ్లై 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. అంతకుముందు 2003 నుంచి 2008 వరకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిణాఫ్రికాలో తొలి నల్లజాతి మహిళా న్యాయమూర్తిగా కూడా ఆమె గుర్తింపు పొందారు.

శాంతికి అంతర్జాతీయ చట్టాలే పునాది

ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలను దౌత్యం, ఒప్పందాలు, చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవచ్చని నార్వే నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. శాంతియుత ప్రపంచ నిర్మాణానికి అంతర్జాతీయ చట్టాలు పునాదిగా నిలుస్తాయని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సంఘర్షణలు, సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ చట్టాల ప్రాధాన్యం మరింత పెరిగిందని వివరించింది.

నేటి నుంచి 9 రోజులు పూల పండగ

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్ర సంస్కృతికి ప్రతీక, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ నేడు ప్రారంభం కానుంది. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వేడుకలను ఈ నెల 18 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహిం

పెద్ద చెరువు తూము తెరిచి వరి పంటలకు నీటి విడుదల

- సర్పంచ్ నిర్మల చొరవతో సాగునీరు అందించిన గ్రామస్తులు
- నీటి కొరత తీరడంతో హర్షం వ్యక్తం చేసిన ఆయకట్టుదారులు

ప్రజానావ, రాయపోల్: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామ పరిధిలోని పెద్ద చెరువు ఆయకట్టు కింద సాగు చేస్తున్న వరి పంటలకు నీరందించేందుకు గ్రామ సర్పంచ్ నిర్మల చొరవ తీసుకున్నారు. పంటలు నీటి కొరతతో ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో స్పందించిన ఆమె.. వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఆయకట్టుదారులతో కలిసి శుక్రవారం పెద్ద చెరువు తూమును తెరిచి సాగునీటిని విడుదల చేశారు. వరి పంటకు కీలకమైన దశలో నీరు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందారు. ఈ పరిస్థితిని గుర్తించిన సర్పంచ్ నిర్మల గ్రామస్తులు, వార్డు సభ్యులు, ఆయకట్టుదారులతో చర్చించి పంట పొలాలకు నీరు అందించేలా చర్యలు చేపట్టారు. చెరువు నుంచి నీరు పొలాలకు చేరుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సాగు సమయంలో సకాలంలో నీరు అందించడం వల్ల పంటలు ఎండిపోకుండా కాపాడుకోవడంతో పాటు మెరుగైన దిగుబడికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి సమయానికి స్పందించి సాగునీరు అందేలా చర్యలు తీసుకున్న సర్పంచ్ నిర్మల, వార్డు సభ్యులు, గ్రామస్తులకు ఆయకట్టుదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సింహస్థ కుంభమేళా పనులతో.. త్రయంబకేశ్వర ఆలయం రెండు నెలలు మూసివేత?

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని ప్రసిద్ధ 12 జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన త్రయంబకేశ్వర ఆలయాన్ని సింహస్థ కుంభమేళా సన్నాహాల్లో భాగంగా రెండు నెలల పాటు భక్తుల దర్శనానికి మూసివేయనున్నట్లు సమాచారం. ప్రాథమిక ప్రణాళిక ప్రకారం అక్టోబర్ 15 లేదా 16 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఆలయ పరిసరాల్లో రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ చర్య చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఆలయం మూసివేసినా నిత్య పూజలు, త్రికాల పూజలు యథావిధిగా కొనసాగనున్నాయి. మరోవైపు, భక్తుల రద్దీ దృష్ట్యా అక్టోబర్ 12 వరకు వీఐపీ దర్శనాలను నిలిపివేశారు. ఆలయ మూసివేత తేదీ, వ్యవధిపై దేవస్థాన ట్రస్ట్ అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంది.

రైతులపై అక్రమ కేసులు బేషరతుగా ఎత్తివేయాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజానావ, మహబూబ్‌నగర్ : ప్రభుత్వ అసహనం, అసమర్థత వల్లే సాగునీటి కోసం పోరాడుతున్న రైతులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిలతో కలిసి ఆత్మకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూరాలలో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ, చేతికొచ్చిన పంటలను కాపాడుకోవడానికి నీళ్ల విడుదల చేయాలని కోరిన రైతులపై ప్రజా ఆస్తుల విధ్వంసం పిడిపిపి వంటి తీవ్రమైన కేసు నం. 103/2026 పెట్టడం దుర్మార్గమైన చర్య అని నిరసన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి అనుభవంతో సలహాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే రైతులు తిరగబడ్డారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస రైతులపై లేదని దుయ్యబట్టారు. ఎన్ని కేసులు పెట్టినా బెదరకుండా ప్రజలు, రైతుల పక్షాన పోరాడతామని, రైతులపై మోపిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

డిజిటల్ యుగంలోనూ చెక్కుచెదరని తపాలా సేవలు

ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన

ప్రజానావ, వేములవాడ: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని తపాలా కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోస్టాఫీసును సందర్శించగా, తపాలా సేవల ప్రాధాన్యత, కాలానుగుణంగా వాటిలో వచ్చిన మార్పులను అధికారులు వివరించారు. ఒకప్పుడు ఉత్తరాల ద్వారా సమాచారాన్ని చేరవేసిన తపాలా శాఖ.. నేటి డిజిటల్ యుగంలోనూ ప్రజలకు విస్తృత సేవలు అందిస్తోందని సబ్ పోస్ట్‌మాస్టర్ రఘు మోహన్ తెలిపారు. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, ఆధార్ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపాలా శాఖ సేవలను టీవీ స్క్రీన్‌పై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్ట్‌కార్డులు అందించి, ఉత్తరాలు రాసే విధానాన్ని నేర్పించారు. గతంలో సుదూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యుల యోగక్షేమాలను ఉత్తరాల ద్వారా తెలుసుకునే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేసి ప్రపంచ తపాలా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సైతం గతంలో ఉత్తరాల ద్వారా తమ బంధువులు, స్నేహితుల యోగక్షేమాలు తెలుసుకున్న అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ తపాలా సేవలు కూడా ఆధునిక అవసరాలకు అనుగుణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది రాజేందర్, స్నైపాఠశాల ఉపాధ్యాయులు శైలజ, దివ్య, సిబ్బంది జక్కుల మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు స్వచ్ఛంద సమాచార వెల్లడి కీలకం

- ఆర్టీఐ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం
- ప్రతి దరఖాస్తుకు గడువులోగా స్పష్టమైన సమాధానం ఇవ్వాలి
- సమాచార హక్కు వారోత్సవాలు– 2026లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది ప్రజా స్వామ్యానికి ప్రాణాధారమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీత నం, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు–2026లో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలు దాఖలు చేసే ఆర్టీఐ దరఖాస్తులను కేవలం కాగితాలుగా పరిగణించకూడదని, వాటి వెనుక సమస్య పరిష్కారం, హక్కుల పరిరక్షణ లేదా న్యాయం కోసం చేసే విజ్ఞప్తి ఉంటుందని అన్నారు. దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార గణాంకాలే చట్టం విజయానికి కొలమానం కాదని, పరిపాలనా విధానాల్లో శాశ్వతమైన పారదర్శక మార్పు రావాలని ఆకాంక్షించారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం స్వచ్ఛంద సమాచార వెల్లడి (ప్రో యాక్టివ్ డిస్‌క్లోజర్)కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, అర్హతలు, వాటి అమలు ప్రక్రియలకు సంబంధించిన సమాచారం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటే ఆర్టీఐ దరఖాస్తుల అవసరం తగ్గుతుందని వివరించారు. తెలంగాణ వంటి వైవిధ్యభరితమైన రాష్ట్రంలో తెలుగు సహా స్థానిక భాషల్లో సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మహిళలు, దివ్యాంగులు, అట్టడుగు వర్గాలకు సమాచార హక్కు సులభంగా చేరేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), డేటా విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతికతలను సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), ప్రథమ అప్పీలేట్ అధికారులు ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా స్వీకరించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా నిష్పక్షపాతంగా, స్పష్టమైన, సహేతుక మైన సమాధానాలు అందించాలని సూచించారు. పరిపాలనా పారదర్శకతకు, పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కుకు మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 10న హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)లో నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిం చారు. వివిధ రాష్ట్రాల ప్రధాన సమాచార కమిషనర్లు, సమాచార కమిషనర్లతో కార్యాచరణ లో ఏకరూపతపై జరిగిన చర్చలు సార్థకంగా సాగాయని తెలిపారు. ఇలాంటి అనుభవాల మార్పిడి ద్వారా ఆర్టీఐ చట్టాన్ని మరింత సమర్థం గా, ఏకరీతిలో అమలు చేయవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాచార హక్కుపై సరైన మార్గదర్శ కత్వం అందించడం, సుపరిపాలనను బలోపేతం చేయడంలో తెలంగాణ సమాచార కమిషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి పౌరుడు ఆత్మవిశ్వాసంతో తన హక్కులను కోరగలిగేలా, ప్రతి ప్రభుత్వ సంస్థ బాధ్యతాయుతంగా స్పందించేలా పారదర్శక, సాధికార తెలంగాణ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి గత 15 నెలల్లో సమాచార కమిషన్ సాధించిన ప్రగతిని వివరించారు. సమాచార హక్కు వారోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలు, అధికారులకు గవర్నర్ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఉత్తమ స్వచ్ఛంద సమాచార వెల్లడి విభాగంలో జిల్లా కేటగిరీ అవార్డులను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్. హరీష్ అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన శాఖగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అవార్డు లభించగా, ఆ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ స్వీకరించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సచివాలయ శాఖ విభాగంలో ఆర్థిక శాఖకు అవార్డు దక్కగా, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అందుకున్నారు. ఉత్తమ ప్రజా సమాచార అధికారుల విభాగంలో ఖమ్మం కలెక్టరేట్ డీఆర్వో రామ్మూర్తి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ఎం.ఏ. నజీర్, మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, తెలంగాణ సమాచార కమిషన్ పీఐఓ జె. రాము అవార్డులు అందుకున్నారు. ప్రత్యేక కేటగిరీలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థకు సంబంధించి టీజీఆర్టీసీ తరఫున వై. నాగిరెడ్డి, రామగుండం తహసీల్దార్ రవీందర్‌రావు అవార్డులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్త ఎక్కా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్‌కుమార్, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్లతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీలేట్ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రకటనను లోక్‌భవన్ ప్రెస్ సెక్రటరీ జారీ చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే
- సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో వంద రోజుల త్రివర్ణ పతాక కార్యక్రమం

ప్రజానావ, సిరిసిల్ల : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే సూచించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన 100 రోజుల త్రివర్ణ పతాక కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి విద్యా సంవత్సరంలో 100 రోజుల పాటు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశం పట్ల గౌరవం, బాధ్యతను పెంచుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించి మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ సాయి కిరణ్, కళశాల ప్రిన్సిపాల్ విజేయ్ రగునందన్, కళశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ల సేవలు స్ఫూర్తిదాయకం

- నారీ శక్తి, అనిమల్ ఫుట్ ఫౌండేషన్ల కార్యక్రమాలు అభినందనీయం
- బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: నారీ శక్తి ఫౌండేషన్, అనిమల్ ఫుట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిజాముద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఒంటరి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫౌండేషన్ల తరఫున జారీ చేసిన ఉద్యోగ నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితుల్లో మానవతావాదుల చొరవతో చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం ద్వారా వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఫౌండేషన్ల సహకారంతో వివిధ ప్రైవేట్ సంస్థల్లో 25 మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడతామని కార్యక్రమ నిర్వాహకుడు నిజాముద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిస్తా హౌస్ యజమాని మజార్ సయ్యద్ హుస్సేన్, విజన్ ఇన్ఫోటెక్ అధినేత అశోక్, ఎల్లక్ట్రిక్ ఆటో తయారీ సంస్థ యజమాని నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే వేడుకలు, కేక్ కటింగ్‌లు నిషేధం

- క్షణికానందం కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
- యువతకు పోలీసుల విజ్ఞప్తి
- ఆరేళ్ల చిన్నారి పుట్టినరోజు నాడే ప్రమాదంలో ఇద్దరి మృతి
- పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు

ప్రజానావ, హైదరాబాద్: ట్యాంక్‌బండ్‌తో పాటు నగరం లోని ప్రధాన రహదారు లు, చెరువులు, పార్కులు, ఇతర బహిరంగ ప్రదేశాల వద్ద అర్ధరాత్రి వేళల్లో పుట్టినరోజు వేడుకలు, కేక్ కటింగ్‌లు నిర్వహించవద్దని పోలీసులు నగర ప్రజలకు, ముఖ్యంగా యువతకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సంతోషంగా జరుపుకోవాల్సిన పుట్టినరోజు వేడుకలు కొందరి క్షణికావేశం, నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి తన పుట్టినరోజు నాడే ప్రాణాలు కోల్పోగా, ఆమెతో పాటు కుటుంబ సభ్యుడు కూడా దుర్మరణం చెందడం కలచివేసిందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ట్యాంక్‌బండ్ పై ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు. అక్కడ చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పుట్టినరోజు అనేది కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత వేడుక అని, ఇళ్ల వద్ద లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో మాత్రమే జరుపుకోవాలని సూచించారు. అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై జనసంచారం తక్కువగా ఉండటంతో వాహనాలు అధిక వేగంతో దూసుకొస్తుంటాయని, అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్లపైకి రావడం ప్రమాదక రమని హెచ్చరించారు. ట్యాంక్‌బండ్‌పై ఇలాంటి వేడుకలు నిర్వహించడం నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ మేరకు గతంలోనే జీహెచ్ఎంసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచే శారు. పోలీసులు నిరంతరం పహారా కాస్తూ అక్కడికి వచ్చే వారిని పంపిస్తున్నప్పటికీ, అర్ధరాత్రి వేళల్లో తిరిగి వచ్చి వేడుకలు నిర్వహించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయని పేర్కొన్నారు. కేవలం క్షణికానందం కోసం చేసే నిర్లక్ష్యపు పనులతో అమూల్యమైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ఎవరూ అర్ధరాత్రి వేళల్లో ట్యాంక్‌బండ్, చెరువులు, ప్రధాన రహదారులు, ఇతర బహిరంగ ప్రదేశాల వద్దకు వచ్చి పుట్టినరోజు వేడుకలు నిర్వహించవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

బతుకమ్మ, దసరా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- తార్నాక డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
- మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా తార్నాక డివిజన్‌లో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణకు అవసరమైన బతుకమ్మ పాండ్లు ఏర్పాటు చేయాలని, పండుగల సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, రహదారుల పరిశుభ్రత, చెత్త తొలగింపు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రజల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పండుగల సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బతుకమ్మ, దసరా పండుగలు తార్నాక డివిజన్‌లో ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో ప్రముఖుల భేటీ

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి. వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు తన స్వీయచరిత్ర 'ఉనికి' పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఎమ్మెల్సీ ఎస్. వాణీదేవి, పి.వి. ప్రభాకర్‌రావు, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి తదితరులు కూడా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను వేర్వేరుగా కలిసి మాట్లాడారు.

గచ్చిబౌలిలో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు

- ఉదయం 5 గంటల నుంచే రూట్ల మార్పు
- గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్‌తో వాహనాల దారి మళ్లింపు
- ఉదయం 9 గంటల వరకు ఆంక్షలు
- భారీ వాహనాలకు అనుమతి నిరాకరణ
- ప్రయాణికులు ముందుగానే రూట్లు ప్లాన్ చేసుకోవాలని సూచన

ప్రజానావ, హైదరాబాద్: గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ నేపథ్యంలో ఆదివారం గచ్చిబౌలి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పాటు పలు మార్గాల్లో దారి మళ్లింపులు చేపట్టనున్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం నుంచి ఐఐఐటీ జంక్షన్ మీదుగా విప్రో జంక్షన్ వరకు 2కే, 5కే, 10కే రన్‌లు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విప్రో, ఐఐఐటీ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీసులు తెలిపారు. విప్రో సర్కిల్ నుంచి ఐఐఐటీ జంక్షన్ వైపు వచ్చే వాహనాలను నానక్‌రామ్‌గూడ వైపు మళ్లించి, అక్కడి నుంచి గచ్చిబౌలి వద్ద ఔటర్ రింగ్ రోడ్డులోకి అనుమతించనున్నారు. లింగంపల్లి నుంచి వచ్చే వాహనాలను హెచ్‌సీయూ బస్ డిపో, మసీద్ బండ, బొటానికల్ గార్డెన్, రాడిసన్ జంక్షన్ మీదుగా గచ్చిబౌలికి మళ్లించనున్నారు. ఆంక్షలు అమల్లో ఉండే ఉదయం 5 నుంచి 9 గంటల వరకు ట్రక్కులు, లారీలు, డీసీఎంలు, గూడ్స్ క్యారియర్లు, రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) వాహనాలు, వాటర్ ట్యాంకర్లకు అనుమతి ఉండదని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

నోబెల్‌పై ట్రంప్ గంపెడు ఆశలు

నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్యోస్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్యోస్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటి మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు దా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహం అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రసరసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా "నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారి అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలల బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీ పెద్ద అవమానమని ఆయన అన్నారు. 2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయన తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాదో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతలను దా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో దా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పుర స్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతు న్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండక పోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు.

తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పుర స్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

పత్తి కుప్పకు నిప్పు.. 15 క్వింటాళ్ల పంట బూడిద

పజానావ, మహబూబ్‌నగర్: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఓ రైతుకు తీరని నష్టం వాటిల్లింది. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాట్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు బుక్క చిన్న అంజప్ప తన పొలంలో పండించిన పత్తిని కూలీల సహాయంతో ఏరించి, పొలం గట్టుపై కుప్పగా నిల్వ ఉంచాడు. అయితే రాత్రి సుమారు 8 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తి కుప్పకు నిప్పు పెట్టినట్లు బాధిత రైతు తెలిపాడు. ఈ ఘటనలో సుమారు 15 క్వింటాళ్ల పత్తి అగ్నికి ఆహుతై పూర్తిగా బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎంతో కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని పేర్కొన్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టడంతో పాటు, పత్తి కుప్పకు నిప్పు పెట్టిన వారిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతుకు న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిద్దిపేటలో దశాబ్ది సంబురాలు ప్రారంభం

- **హరీశ్‌రావు జెండా ఊపి 10కే రన్ ప్రారంభం**
- **జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తి**
- **పరుగులో పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత, క్రీడాకారులు, పట్టణ ప్రజలు**
- **మూడు రోజుల పాటు ఘనంగా వేడుకలు**

ప్రజానావ, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది పండుగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి 10కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువత, క్రీడాకారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పరుగెత్తారు. ప్రజల సందడి, క్రీడాకారుల ఉత్సాహం మధ్య సాగిన 10కే రన్‌తో జిల్లా దశాబ్ది సంబురాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. సిద్దిపేటలో నేటి నుంచి మూడు రోజుల పాటు జిల్లా దశాబ్ది పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద హరీశ్‌రావు నివాళులర్పించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొననున్నారు. జిల్లా ఆవిర్భవించినప్పటి నుంచి పదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, ప్రగతిని గుర్తుచేసుకుంటూ దశాబ్ది వేడుకలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంతో పాటు యువత, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు సంబంధిత వర్గాలు సన్నద్ధమయ్యాయి.

విద్యుత్ కోతలపై రైతుల కన్నెర్ర

- **సబ్‌స్టేషన్ ముట్టడి**
- **24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్**
- **ఏడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన**
- **200 మందికి పైగా రైతుల ఆందోళన**

ప్రజానావ, మద్దూరు: వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని, కోతలు లేకుండా నాణ్యమైన కరెంటు అందించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో రైతులు ఆందోళనకు దిగారు. మరుమాముల, సలాకపూర్, లద్దునూర్, ధర్మారం గ్రామాలకు చెందిన 200 మందికి పైగా రైతులు మరుమాముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు కేవలం ఏడు గంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుండటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు అవసరమైన సమయంలో కరెంటు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. గతంలో వ్యవసాయానికి సరిపడా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే వ్యవసాయానికి తగినంత విద్యుత్ అందడం లేదని విమర్శించారు. వర్షాకాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పంటలు ఎండిపోయే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని, దీనికి విద్యుత్ కోతలే ప్రధాన కారణమని ఆరోపించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రుణాలు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించారని గుర్తుచేశారు. గతంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఇప్పుడు ఎందుకు సరఫరా కావడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించే వరకు తమ పోరాటాన్ని కొనసాగి స్తామని స్పష్టం చేశారు. అనంతరం రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేర్యాల ఏడీఈ వెంకటొగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సర్పంచులు కాసర్ల రేణుక కనకరాజు, జక్కుల కనకమ్మ లింగయ్య, గడిపే మౌనిక అనిల్‌కు మార్, మాజీ సర్పంచులు సుందరగిరి ప్రవంతి పరశురాములగౌడ్, వంగ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఉత్కం మల్లేశం, నాయకులు పశుపతి, రవీందర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు బీఆర్ఎస్ శ్రీకారం

ప్రజానావ, ఎర్రుపాలెం: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ ఎర్రుపాలెం మండల కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, అర్హులైన వారందరూ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పార్టీ నాయకులు కోరారు. ఎర్రుపాలెంలోని సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ కళాశాల అధ్యాపకులతో పాటు ప్రజ్ఞ, ప్రతిభ పాఠశాలల ఉపాధ్యాయులకు పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–18ను అందజేశారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు, దరఖాస్తుల నమోదుకు అవసరమైన సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు కీలకమని పేర్కొంటూ, మండలంలోని అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి గడువులోగా వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల వారీగా పట్టభద్రులను సంప్రదించి ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా బృందం సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడి దరఖాస్తు నమోదుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బొ్రా నరసింహారావు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు, షేక్ బాబు సాహెబ్, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- **అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి**
- **పోషణ అభియాన్ కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగడప పద్మ, సూపర్‌వైజర్ పార్వతి**

ప్రజానావ, రుద్రంపూర్: పోషకాహార లోపం లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, సూపర్‌వైజర్ పార్వతి పిలుపునిచ్చారు. పోషణ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని రామవరం అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. చిన్నారులు, తల్లుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వివిధ రకాల పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. వాటి పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను తల్లులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామవరం డివిజన్ కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, ఆకునూరి సుప్రియ, ఎర్రబెల్లి శంకర్, కంచర్ల హిమశ్రీ, బానోత్ స్వప్న నాయక్, అంగన్‌వాడీ టీచర్లు ఎన్. సరోజ, భూక్యా దేవి, నీలవేణి, షహనాజ్ బేగం, జ్యోతి, రమాదేవి, అలివేలు, రాధిక, రజిత, పద్మతో పాటు ఆయాలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ-సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- **సరిహద్దుల నిర్ధారణలో పారపాట్లకు తావివ్వొద్దు**
- **కలెక్టర్ అంకిత్ ఆదేశం**
- **వృద్ధుడి పింఛన్ దరఖాస్తుపై తక్షణ స్పందన**

ప్రజానావ, జూలూరుపాడు: భూ రీ–సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పరిధిలో మొత్తం 1,426 ఎకరాల భూమి ఉండగా, సుమారు 12.50 కిలోమీటర్ల మేర భూ సరిహద్దుల నిర్ధారణ సర్వే కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను వినియోగించడం తోపాటు పాత భూ రికార్డులతో వివరాలను సరిపోల్చి, భూములకు సంబంధించిన సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సరిహద్దుల విషయంలో రైతులకు ఉన్న సందేహాలను క్షేత్రస్థాయిలోనే నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. రీ–సర్వే పూర్తయిన అనం తరం భూ రికార్డులు మరింత స్పష్టంగా మారి, భవిష్యత్తులో భూ యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు తలెత్తే కుండా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామ పర్యటనలో భాగం గా కలెక్టర్ స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనకున్న రెండు ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నానని రైతు భూక్యా పంతులు ఆయనకు వివరించారు. తన కుమారులు పట్టించుకోవడం లేదని, వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత దరఖాస్తును తక్షణమే పరిశీలించి అర్హత మేరకు పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూలూరు పాడు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి, సర్పంచ్ జి. సింధు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయపోల్ నూతన ఎస్ఐ లింగంకు ఘన సన్మానం

ప్రజానావ, రాయపోల్: సిద్దిపేట జిల్లా రాయపోల్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బి.లింగం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.లింగంను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలుపుతూ, విధి నిర్వహణలో సమర్థవంతంగా ముందుకు సాగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షుడు అయ్యగల్ల రవి, రాష్ట్ర నాయకుడు పుర నర్సింలు, మాజీ సర్పంచ్ రామోళ్ల స్వామి, జర్నలిస్ట్ ఉషణగల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలి

- **విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ ధర్నా**
- **లోవోల్టేజ్‌తో బోరు మోటర్లు కాలిపోతున్నాయి**
- **నీరందక ఎండిపోతున్న వరి పంటలు**
- **ప్రభుత్వాన్ని నిలదీసిన పద్మాదేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి**

ప్రజానావ, మెదక్: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోవోల్టేజ్ సమస్యలను నిరసిస్తూ మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గేటు వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ బోరు మోటర్లకు తక్కువ వోల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతుండటంతో మోటర్లు కాలిపోతున్నాయని, దీంతో పంటలకు నీరందక ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో వ్యవసాయానికి కనీసం ఆరు గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ కీలక సమయంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ కోతల కారణంగా మోటర్లు పనిచేయక సాగునీరు అందక రైతులు పంట నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అన్నదాతలు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. ఈ ధర్నా, రాస్తారోకో కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే గద్వాల జిల్లా అభివృద్ధి

- **జిల్లా దశాబ్ది వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 5కే రన్**
- **యువతతో కలిసి పాల్గొన్న బాసు హనుమంతు నాయుడు**

ప్రజానావ, గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో ముందుకు నడిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు అన్నారు. గద్వాల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న దశాబ్ది కార్యక్రమాల్లో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి 5కే రన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా వైఎస్సార్ చౌక్ వరకు నిర్వహించిన పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతు నాయుడు మాట్లాడుతూ గద్వాల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంలో అందరి సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో 5కే రన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్‌కు ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుతో పాటు నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గద్వాల జిల్లా పురోగతికి కేసీఆర్ కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జి. రాఘవేంద్రరెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, నంటెన్న, టీఎన్ఆర్ జగదీష్, దుబన్న, గువ్వల గోపాల్, నరసింహులు, మోహన్ యాదవ్, చిత్తరి కిరణ్, కమ్మరి రాము, రామకృష్ణ, కోటేష్, కురవ పల్లయ్య, బీచుపల్లి, వెంకటేష్ నాయుడు, జాంపల్లి భరత్ సింహారెడ్డి, వినయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ షటిల్ పోటీలకు.. ఎంపికైన సిరిసిల్ల వ్యవసాయ అధికారి అష్టల్ బేగం

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం జాతీయస్థాయి షటిల్ బ్యాట్మింట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7 న హైదరాబాద్ ఎల్బీ స్టేడియం లో జరిగిన అఖిలభారత సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం రాజన్న సిరిసిల్ల నుండి షటిల్ బ్యాట్మింటన్ సింగిల్స్ అలాగే డబుల్స్ లో పాల్గొని, సెటిల్ బ్యాట్మింటన్ సింగిల్స్ డబుల్స్ లో ప్రథమ స్థానంలో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ అభినందనలు తెలియజేశారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు

- టీకాల నిర్వహణ, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై దృష్టి
- డీఎంహెచ్ఓ పి. సాధన

ప్రజానావ, ఆదిలాబాద్: జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంతోపాటు టీకాల నిర్వహణను పటిష్ఠం చేసి, మాతాశిశు మరణాలను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) పి. సాధన వెల్లడించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ ఎస్. సంగీత శుక్రవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ విషయాలను వివరించారు. నవజాత శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా రిమ్స్‌లో ప్రత్యేకంగా ఎంఎస్ఐసీయూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదల, టీకాల కార్యక్రమాల నిర్వహణ, మాతాశిశు సంరక్షణకు సంబంధించిన అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ పీఓ డాక్టర్ వంశీ, డీటీసీఓ ఈశ్వర్‌రాజ్, మాతాశిశు సంరక్షణాధికారి నీలోఫర్, వైద్యులు జాదవ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దసరా రద్దీతో కిక్కిరిసిన హనుమకొండ బస్టాండ్

- బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు
- సీట్ల కోసం ప్రమాదకరంగా ఎక్కే యత్నాలు

ప్రజానావ, హనుమకొండ: దసరా సెలవుల నేపథ్యంలో హనుమకొండ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్టాండ్ ఆవరణలో బస్సుల కోసం జనం పెద్దఎత్తున పోటెత్తడంతో పండుగ సందడి నెలకొంది. బస్సుల్లో సీట్లు దక్కించుకునేందుకు ప్రయాణికులు పోటీపడుతూ ప్రమాదకరంగా బస్సులు ఎక్కేందుకు ప్రయత్నించారు. తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులతో వచ్చిన మహిళలు, వృద్ధులు కిక్కిరిసిన బస్సుల్లోకి ఎక్కలేక అవస్థలు పడ్డారు. ఒకేసారి వందలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకోవడంతో అక్కడికి వచ్చిన బస్సులు వచ్చినట్లే నిండిపోతున్నాయి. దీంతో పండుగ ప్రయాణాల కోసం వచ్చిన ప్రజలు బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సంప్రదాయ బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మనీషా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- వివిధ రకాల పూలతో బతుకమ్మల పేర్పు
- సంప్రదాయ పాటలతో విద్యార్థుల సందడి

ప్రజానావ, ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మనీషా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఆదిలాబాద్ వైద్య విభాగం: జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలుతో పాటు టీకాల నిర్వహణ, మాతాశిశు మరణాలను నియంత్రించడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు డీఎంహెచ్ఓ పి.సాధన వెల్లడించారు. ఈ సమావేశంలో ఎన్సీడీ పీఓ డాక్టర్ వంశీ, డీటీసీఓ ఈశ్వర్‌రాజ్, మాతాశిశు సంరక్షణాధికారి నీలోఫర్, వైద్యులు జాదవ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు

- తెలంగాణ ఉద్యమ నేత, న్యాయవాది జ్యోతి కిరణ్‌కు ఇవ్వాలని అభ్యర్థన

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల వాస్తవ్యురాలు, తెలంగాణ రాష్ట్ర సాధనలో అడ్వకేట్ జేఏసీ కో కన్వీనర్‌గా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన హైకోర్టు సీనియర్ న్యాయవాది, పద్మశాలి వర్గానికి చెందిన గుడ్ల జ్యోతి కిరణ్ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పట్టణంలో పద్మశాలి ముద్దుబిడ్డ కు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని ప్రకటించిన దానికి అనుగుణంగా జ్యోతి కిరణ్ శుక్రవారం సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ప్రముఖులతో కలిసి వచ్చారు. హైదరాబాదులోని గాంధీ భవన్ లో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. తనతో పాటుగా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, ఎండి గౌస్, వైద్య శివప్రసాద్, ఎల్లే లక్ష్మీ నారాయణ, కోడం శ్రీనివాస్, కొమిరిశెట్టి తిరుపతి, వంగరి దేవదాసు, మ్యాన ప్రసాద్, చేపూరి శ్రీనివాస్, అన్నల్ దాస్ భాను, డైరెక్టర్ స్వర్గం రాజు, అడ్డగట్ల శంకర్, రేగొండ సందీప్, గుడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణకు చట్టం పకడ్బందీగా అమలు

- డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఐడీఓసీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం
- వృద్ధులకు సన్మానం, వృద్ధుల చట్టంపై అవగాహన

ప్రజానావ, సిరిసిల్ల : వయోవృద్ధుల, తల్లితండ్రుల సంరక్షణకు చట్టం పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధ్వర్యం లో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల, తల్లితండ్రుల సంక్షేమానికి అమలు చేస్తున్న చట్టాలు, పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి వృద్ధుల సంరక్షణ చట్టాలు, ఉపయోగాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వృద్ధుల నుంచి గౌరవం, మర్యాద, సంస్కృతి, సంప్రదాయాలు, విశేషమైన అనుభవాలు ఇప్పటి తరం వారు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు తాము జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిని మొత్తం తమ పిల్లల పేరిట చేయవద్దని సూచించారు. ఒకవేళ చేయాల్సి వస్తే తమ సంరక్షణ చూడకపోతే వెనక్కి తీసుకుంటామనే నిబంధన పెట్టి చేయాలని తెలిపారు. వృద్ధులు తమకు వచ్చిన ఇబ్బందులు తెలియజేసేందుకు పోలీస్ స్టేషన్ కు రావచ్చని ఎస్పీ మహేష్ బి గితె తెలిపారు. పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని వివరించారు. వారికి అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బి కుమారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, వృద్ధ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

- వడకపూర్‌లో విషాద ఛాయలు
- అధికారిక లాంఛనాలతో జవాన్ రమాకాంత్ అంత్యక్రియలు

ప్రజానావ పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడకపూర్ గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ మొగురం రమాకాంత్ ములుగు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విధి నిర్వహణ నిమిత్తం వెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోవడంతో స్వగ్రామం వడకపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు, బంధుమిత్రులు ఆయన మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

ములుగు జిల్లా గోవిందరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో విధుల నిమిత్తం వెళ్తుండగా, 39వ బెటాలియన్‌కు చెందిన సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. జవాన్ మొగురం రమాకాంత్ తీవ్ర ప్రమాదానికి గురై మృతి చెందారు. విధి నిర్వహణలో ఉన్న జవాన్ ఆకస్మిక మరణవార్తతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

మృతి చెందిన జవాన్ మొగురం రమాకాంత్‌కు ప్రభుత్వ, శాఖాపరమైన అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎల్. వెంకట కృష్ణయ్య, ఎస్ఐ కేపీ రెడ్డి, జూలపల్లి ఎస్ఐ బి. మల్లేశ్, హెచ్‌సీ ఏ. శ్రీనివాస్, పీసీలు ఎం. పవన్ కుమార్, ఎం. మనోహర్ తదితరులు పాల్గొని జవాన్‌కు నివాళులర్పించారు. దేశ సేవలో విధులు నిర్వహిస్తున్న జవాన్ అకాల మరణం వడకపూర్ గ్రామంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. రమాకాంత్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఆస్తులపై ఏసీబీ సోదాలు

- ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- భారీగా ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు

ప్రజానావ, మహబూబాబాద్: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మేనేజర్ నరసింహారావుపై వచ్చిన ఆరోపణల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఖమ్మంలోని ఆయన నివాసంతో పాటు సూర్యాపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో మొత్తం ఏడు చోట్ల అధికారులు ఏకకాలంలో సోదాలు చేస్తున్నారు. నరసింహారావుకు చెందిన ఇళ్లతో పాటు ఆయన బినామీలుగా భావిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ సోదాల్లో ఆయనకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. తనిఖీలు పూర్తయిన అనంతరం ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఒక్క నిమిషంలో 110 శరీర భాగాలు

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో యషికకు చోటు
- ప్రోగ్రెస్ హైస్కూల్ విద్యార్థిని అరుదైన ప్రతిభ
- బాలల హక్కులు, విద్య ప్రాధాన్యంపై న్యాయమూర్తి అవగాహన

ప్రజానావ, వరంగల్: ఇందిరానగర్‌లోని ప్రోగ్రెస్ హైస్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థిని బోయిని యషిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2026లో స్థానం సంపాదించింది. మానవ శరీరంలోని తొమ్మిది ప్రధాన వ్యవస్థలకు సంబంధించిన 110 భాగాల పేర్లను కేవలం ఒక నిమిషంలో చెప్పి ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యషికతో పాటు ఆమె తల్లిదండ్రులు రాజు రెడ్డి, రాజిని రెడ్డిలను అతిథులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమ పూజిత మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారిలో సామాజిక బాధ్యత పట్ల అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. అనితా రెడ్డి, డాక్టర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- వేములవాడ ఏరియా ఆసుపత్రిలో పోషణ మాసం ముగింపు.. బేరా యంత్రం ప్రారంభం

ప్రజానావ, వేములవాడ: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు చిన్నారుల్లో పోషకాహార లోపాలు, పుట్టుకతో వచ్చే ఆరోగ్య సమస్యలను తొలిదశలో గుర్తించి చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి, బేరా యంత్రాన్ని ప్రారంభించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో వినికిడి లోపం, మాటలు రాకపోవడం, శారీరక ఎదుగుదల సమస్యలను తొలిదశలో గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లోని నిమ్స్, సరోజినీదేవి కంటి ఆసుపత్రి, ఈఎన్‌టీ ఆసుపత్రుల్లో వైద్య సేవలు కల్పిస్తున్నట్లు వివరించారు. వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఉచిత మోకాళ్ల శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సీ–ఆర్మ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లల ఎత్తు, బరువును ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోషకాహార లోపం, రక్తహీనత, వినికిడి సమస్యలు, మాటలు రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అవసరమైన చిన్నారులకు డీఈఐసీ కేంద్రంలో చికిత్స, ఫిజియోథెరపీ సేవలు అందించడంతో పాటు అవసరమైతే హైదరాబాద్‌లో ఉన్నత వైద్యం కల్పిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో గతంలో వినియోగంలో లేని బేరా యంత్రానికి ప్రత్యేక గది, అవసరమైన ఏర్పాట్లు చేసి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా పోషకాహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. డీఈఐసీ కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలతో సుమారు 18 మంది చిన్నారులు కోలుకుని నడవగలుగుతున్నారని వారి తల్లిదండ్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ కేవీఎన్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల ఇంటి స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలి

- తహసీల్దార్‌కు రాజన్న హిల్స్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ వినతి

ప్రజానావ, వేములవాడ : వేములవాడ పట్టణంలోని వర్కింగ్ జర్నలిస్టులకు నాంపల్లి శివారులోని సర్వే నంబర్ 391లో కేటాయించిన ఇంటి స్థలాలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసి, జర్నలిస్టులకు న్యాయం చేయాలని రాజన్న హిల్స్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ, వేములవాడ ఆధ్వర్యంలో తహసీల్దార్ జయంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కొల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వర్కింగ్ జర్నలిస్టులు తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నాంపల్లి శివారులోని సర్వే నంబర్ 391లో సుమారు 60 మంది జర్నలిస్టులకు గతంలో ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు వాటిని పూర్తిస్థాయిలో రెగ్యులరైజ్ చేయకపోవడంతో సంబంధిత జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. స్థలాల కేటాయింపు జరిగి చాలా కాలం గడిచినా చట్టబద్ధమైన హక్కులు పొంద లేకపోవడం వల్ల ఇళ్ల నిర్మాణం, బ్యాంకు రుణాలు పొందడం, ఇతర ప్రభుత్వపరమైన ప్రక్రియల్లో సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. జర్నలిస్టులు తమ కుటుంబాల భవిష్యత్తు కోసం కేటాయించిన స్థలాలపై పూర్తి హక్కులు పొందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, గతంలో కేటాయించిన ఇంటి స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని కొల్లూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 391కు సంబంధించిన రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ జయంత్ కుమార్ సంబంధిత రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల సమస్య పరిష్కారమైతే సుమారు 60 మంది జర్నలిస్టులతో పాటు వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు రాజన్న హిట్స్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కొల్లూరి శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షులు జుట్టు మల్లేశం, ప్రధాన కార్యదర్శి రైకన్నపేట శ్రీనివాస్, టీఎస్ జేయు నియోజకవర్గ అధ్యక్షుడు అధ్యక్షులు కోడం కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తాటిపల్లి నరసింహస్వామి, దూస రాజేందర్, చీకటిమల్ల చంద్రశేఖర్, ఏనుగుల శ్రీనివాస్, కొల్లూరి సంతోష్, నర్సింగోజు రామ్ కిషన్, నూక సంతోష్, గున్నాల నరేష్, కోడం సురేష్, అవధూత శ్రీధర్, మరియు అఫీద్, ఖమ్మం రమాకాంత్, గుంటి గణేష్,లు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకువచ్చిన పూలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు కలిసి అందమైన బతుకమ్మలను చేర్చారు. బతుకమ్మ పండుగ విశేషాలను, ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పాటలతో ఆడి పాడారు.

భూపాలపల్లిలో జాబ్ మేళా

- భారీగా హాజరైన నిరుద్యోగ యువత
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, టాస్క్ కంపెనీ ప్రతినిధులు

ప్రజానావ, భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు టాస్క్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ మేళాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువత అధిక సంఖ్యలో పాల్గొనడంతో జాబ్ మేళా సందడిగా సాగింది.

నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం

- **అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి**
- **యుద్ధ నేరాలు, మారణహోమాలపై విచారణకు విశేష సేవలు**

ఓస్లో: భారతీయ తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవాది నవనీతం 'నవీ' పిళ్లై 2026 సంవత్సరానికిగానూ నోబెల్ శాంతి పురస్కారానికి ఎంపికయ్యారు. శాంతి, అంతర్జాతీయ న్యాయ సూత్రాల పరిరక్షణ కోసం ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ వెల్లడించింది. యుద్ధ నేరాలు, మానవాళికి వ్యతిరేకంగా జరిగిన నేరాలు, మారణహోమాలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని కమిటీ పేర్కొంది. 1941లో దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో భారతీయ తమిళ కుటుంబంలో జన్మించిన నవీ పిళ్లై వర్ణవివక్ష పాలనలో జాతి వివక్షను ఎదుర్కొంటూ పెరిగారు. 1967లో నాటల్ ప్రాంతంలో న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తలకు న్యాయ సహాయం అందించడంతో పాటు, రాబెన్ ఐలాండ్ జైలులోని ఖైదీల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు. నెల్సన్ మండేలా సహా వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడినవారికి న్యాయపరంగా మద్దతుగా నిలిచారు. నాటల్ విశ్వవిద్యాలయం నుంచి బీఏ, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందిన ఆమె, అనంతరం హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి జ్యూరిడికల్ సైన్స్‌లో డాక్టరేట్ సాధించారు. క్వాజులు–నాటల్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా పనిచేయడంతో పాటు, డర్బన్–వెస్ట్‌విల్లే విశ్వవిద్యాలయంలో నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. 1995లో దక్షిణాఫ్రికా హైకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అదే ఏడాది రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్‌కు న్యాయమూర్తిగా ఎన్నికయ్యారు. అక్కడ సుమారు ఎనిమిదేళ్ల పాటు పనిచేసి, అత్యాచారం వంటి లైంగిక హింసను యుద్ధ నేరాలు, మానవాళికి వ్యతిరేకమైన నేరాలు, మారణహోమాలకు సంబంధించిన విచారణల్లో పరిగణనలోకి తీసుకునే విషయంలో కీలక పాత్ర పోషించారు. 2003లో హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2008 సెప్టెంబర్ 1న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి, 2014 వరకు ఆ పదవిలో కొనసాగారు. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సమానత్వం, అంతర్జాతీయ న్యాయ సూత్రాల అమలు కోసం ఆమె నిరంతరం కృషి చేశారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే అంతర్జాతీయ సంస్థ 'ఈక్వాలిటీ నౌ' స్థాపనలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం అంతర్జాతీయ న్యాయస్థానంలో మయన్మార్‌కు సంబంధించిన మారణహోమం కేసులో తాత్కాలిక న్యాయమూర్తిగా సేవలందిస్తున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం కోసం మొత్తం 287 మంది అభ్యర్థులు నామినేట్ కాగా, వారిలో పలు సంస్థలు కూడా ఉన్నాయి. నోబెల్ శాంతి పురస్కారం ప్రారంభమై 125 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఈ అవార్డు ప్రాధాన్యం మరింత చర్చనీయాంశమైంది. ఇప్పటివరకు పలువురు వ్యక్తులతో పాటు అంతర్జాతీయ సంస్థలు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. రెడ్‌క్రాస్ సంస్థ మూడుసార్లు, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ రెండుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాయి. నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నవారిలో మహిళల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. 2014లో మలాలా యూసఫ్‌జాయ్ 17 ఏళ్ల వయసులో ఈ పురస్కారాన్ని అందుకుని, అతి పిన్న వయసులో నోబెల్ శాంతి బహుమతి పొందిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటివరకు అమెరికాకు అత్యధికంగా 24 నోబెల్ శాంతి పురస్కారాలు దక్కగా, బ్రిటన్ 13, స్విట్జర్లాండ్ 11 పురస్కారాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 19 సందర్భాల్లో ఈ అవార్డును ప్రకటించలేదు. 1948లో మహాత్మా గాంధీ హత్యకు గురైన ఏడాది కూడా నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించలేదు. గాంధీని పలుమార్లు ఈ అవార్డుకు నామినేట్ చేసినప్పటికీ ఆయనకు పురస్కారం దక్కలేదు. 1939లో స్వీడన్ పార్లమెంట్ సభ్యుడు అడాల్ఫ్ హిట్లర్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేయగా, ఆ ప్రతిపాదనను అనంతరం ఉపసంహరించుకున్నారు.

తొలిసారి ఒంటరిగా యుద్ధ విమానాన్ని నడిపిన థాయ్ క్వీన్ సుతిదా

- **గ్రిపెన్ ఫైటర్ జెట్‌లో సాహస విహారం**
- **ఇప్పటివరకు 1,188 గంటల విమాన ప్రయాణ అనుభవం**

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాణి సుతిదా తన ఏవియేషన్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. తొలిసారిగా సింగిల్ సీటర్ గ్రిపెన్ యుద్ధ విమానాన్ని ఒంటరిగా నడిపి తన సాహసాన్ని చాటుకున్నారు. దక్షిణ థాయ్‌లాండ్‌లోని సురత్ థాని ప్రావిన్స్‌లో ఉన్న వింగ్–7 వైమానిక స్థావరం నుంచి ఆమె ఈ యుద్ధ విమానాన్ని టేకాఫ్ చేశారు. అక్టోబర్ 8న ఈ సాహస విహారం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. జేఏఎస్ 39సీ గ్రిపెన్ రకానికి చెందిన సింగిల్ సీటర్ యుద్ధ విమానాన్ని రాణి సుతిదా తొలిసారిగా ఒంటరిగా నడిపారు. ఈ సందర్భంగా థాయ్ రాజు మహా వజిరలంకోర్న్ కూడా అక్కడే ఉన్నారు. యుద్ధ విమానంలో విజయవంతంగా విహరించిన అనంతరం రాణికి పుష్పగుచ్ఛం అందజేశారు. రాణి సుతిదాకు విమానాలు నడపడంలో విశేష అనుభవం ఉంది. ఇప్పటివరకు వివిధ రకాల విమానాలను కలిపి సుమారు 1,188 గంటల పాటు నడిపినట్లు సమాచారం. సెస్నా, పిలాటస్, పైపర్ విమానాలతో పాటు బోయింగ్ 737 వంటి జెట్ విమానాలను కూడా ఆమె నడిపారు. 2010 మే 13న తొలిసారిగా పైలట్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. గతంలో సెస్నా టీ–41డీ విమానంతో పాటు రెండు సీట్లతో కూడిన గ్రిపెన్ జేఏఎస్ 39డీ యుద్ధ విమానాన్ని కూడా నడిపారు. రాజు దేశీయ, విదేశీ పర్యటనలకు వెళ్లే సందర్భాల్లో రాణి సుతిదా కోపైలట్‌గా కూడా వ్యవహరించారు. విమానయాన రంగంలో ఇప్పటికే విశేష అనుభవం సంపాదించిన ఆమె, తాజాగా సింగిల్ సీటర్ యుద్ధ విమానాన్ని ఒంటరిగా నడపడం ద్వారా తన నైపుణ్యాన్ని మరోసారి చాటుకున్నారు.

నదిలో నూతన దంపతుల మృతదేహాలు

కాళ్లకు ఇనుప గొలుసులు, మిస్టరీగా మారిన మరణాలు

ముంబై : మహారాష్ట్రలో తీవ్ర కలకలం రేపే ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రేమ వివాహం చేసుకున్న నూతన దంపతుల మృతదేహాలు నదిలో బయట పడటం సంచలనంగా మారింది. ఇద్దరి కాళ్లకు ఇనుప గొలుసులు చుట్టి, తాళం వేసి ఉండటంతో వారి మరణాల వెనుక మిస్టరీ నెలకొంది. వారిని ఎవరైనా హత్య చేశారా? లేక వారిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో సావల్దే ప్రాంతానికి సమీపంలోని నదిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నది అడుగున ఉన్న మృతదేహాలను వెలికితీయగా, భార్యాభర్తలిద్దరి కాళ్లకు ఇనుప గొలుసులు చుట్టి ఉండటంతోపాటు వాటికి తాళం వేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులను జల్గావ్ జిల్లా అమల్నేర్ తాలూకాకు చెందిన శ్యామ్ హరి పాటిల్, స్వప్నగా గుర్తించారు. వీరిద్దరూ కొన్ని నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే, కొత్తగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం పలు సందేహాలకు తావిస్తోంది. కాళ్లకు గొలుసులు వేసి ఉండటంతో ఈ ఘటనలో ఇతరుల ప్రమేయం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు పరిశీలిస్తున్నారు. అదే సమయంలో ఆత్మహత్యకు సంబంధించిన అవకాశాలను కూడా తోసిపుచ్చడం లేదు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే మరణానికి గల అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఈ జంట మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నదిలో మృతదేహాలు లభించడం, కాళ్లకు గొలుసులు ఉండటం వంటి అంశాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

అంబులెన్స్‌లో పేలిన ఆక్సిజన్ సిలిండర్

రోగి సజీవదహనం, ఇద్దరికి గాయాలు



భువనేశ్వర్: ఒడిశాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధం చేసిన అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగి సజీవదహనం కాగా, మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన మయూర్‌భంజ్ జిల్లాలోని ఉదాల ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఉదాల మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో గురువారం రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో రోగిని ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో అంబులెన్స్‌లోని ఆక్సిజన్ సిలిండర్‌ను ఆన్ చేయగానే ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వాహనంలో మంటలు వేగంగా వ్యాపించాయి. ప్రమాద సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగి మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు వ్యక్తులు గాయపడటంతో వారికి చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మరోవైపు, ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మంటల్లో కాలిపోయి మరణించిన రోగి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. కాగా, అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించిన దృశ్యాలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

స్టార్‌లింక్ ప్రవేశంపై మస్క్ అసంతృప్తి

న్యూఢిల్లీ: భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభం ఆలస్యం కావడంపై టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ వరుసగా మూడో రోజు తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో అంబానీని 'ప్రైమ్ మినిస్టర్ అంబానీ'గా సంబోధిస్తూ వ్యంగ్య వ్యాఖ్య లు చేశారు. దేశానికి అసలైన బాస్ అంబానీ అనే విషయం తనకు తెలియకపోయినందుకు క్షమాపణలు చెబుతున్నానంటూ ఎద్దేవా చేశారు. భారత టెలికం మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికే అంబానీ ప్రాధాన్యం ఇస్తున్నారని మస్క్ ఆరోపించారు. స్టార్‌లింక్ సేవలను భారత మార్కెట్లోకి అనుమతించి, ఇతర సంస్థలతో పోటీ పడేందుకు అవకాశం కల్పిస్తారా అని ప్రశ్నించారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ నాణ్య మైన ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో పిల్లలు విద్యకు, చిన్న వ్యాపారులు అంతర్జాతీయ మార్కెట్లకు దూరమవుతున్నా రని మస్క్ పేర్కొన్నారు. స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఇంటర్నెట్ సదుపాయం లభించడంతో పాటు పిల్లల విద్య, చిన్న వ్యాపారాల అభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

మహారాష్ట్రలో కొత్త వివాదం

రాజకీయ నేతల కుటుంబాలకు చెందిన సంస్థలకు భూముల లీజు

ముంబై: మహారాష్ట్రలో ప్రభుత్వ భూముల కేటాయింపులు వివాదాస్పదంగా మారాయి. అహల్యానగర్ జిల్లాలోని హరేగావ్ గ్రామంలో ఉన్న 1,200 ఎకరాల సారవంతమైన భూమిని ముంబైకి చెందిన విశ్వరాజ్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 49 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అల్లుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సన్నిహితుడైన బీజేపీ ఎమ్మెల్సీ అరుణ్ లఖానీ కుమారుడు సారంగ్ లఖానీకి చెందినదిగా పేర్కొంటున్నారు. మహారాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ సంస్థ ఆధీనంలో ఉన్న ఈ భూమిని లీజుకు ఇస్తూ అక్టోబర్ 5న ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వ ఆమోదానికి లోబడి, లీజుకు తీసుకున్న భూమిని తన అనుబంధ సంస్థకు లేదా గ్రూపులోని మరో కంపెనీకి బదిలీ చేయడానికి కూడా విశ్వరాజ్ రెన్యూవబుల్స్‌కు అనుమతి కల్పించారు. ఇందుకోసం మహారాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ సంస్థ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందాల్సిన అవసరం నుంచి సైతం మినహాయింపు ఇచ్చారు. ఇదే ప్రాంతంలో మరో ప్రైవేట్ సంస్థ నిబే గ్రూప్‌కు 1,500 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన రెండు వారాల వ్యవధిలోనే ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా, రక్షణ సంబంధిత ప్రాజెక్టుల కోసం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో)కు కూడా ఈ ప్రాంతంలో 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. తాజా కేటాయింపులతో హరేగావ్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బ్రిటిష్ పాలన సమయంలో స్థానిక రైతుల నుంచి సుమారు 7,376 ఎకరాల భూమిని సేకరించారు. అప్పటి నుంచి అసలు భూ యజమానులు, వారి వారసులు తమ భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు రైతులకు భూములను తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15న నిర్ణయించింది. అయితే, ఆ నిర్ణయం తర్వాత ప్రైవేట్ సంస్థలకు భూములను లీజుకు ఇవ్వడం, ఇందుకోసం అనుసరించిన విధానం, లీజు నిబంధనలు, అసలు రైతు కుటుంబాలకు ఉన్న హక్కులపై పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ల ప్రక్రియ లేకుండానే ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించడాన్ని సామాజిక కార్యకర్త అంజలి దమానియా ప్రశ్నించారు. 48 ఏళ్ల లీజును మరో 48 ఏళ్లపాటు పొడిగించుకునే అవకాశం కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎందుకు మినహాయించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి ప్రవేశించి, ఆ అధికారాన్ని ఉపయోగించుకుని సంపద సంపాదిస్తున్నారని ఆమె ఆరోపించారు. మరోవైపు, తన అల్లుడికి చెందిన సంస్థకు భూమి కేటాయింపుపై వస్తున్న విమర్శలపై ఎంపీ సుప్రియా సూలే స్పందించారు. తన అల్లుడి వ్యాపార, వృత్తిపరమైన కార్యకలాపాలు పూర్తిగా ఆయన వ్యక్తిగత విషయమని పేర్కొన్నారు. "నా అల్లుడు ఏ వ్యాపారం చేస్తున్నాడు, ఏ పని చేస్తున్నాడన్నది పూర్తిగా అతని వ్యక్తిగత విషయం. దానిపై నేనెలా వ్యాఖ్యానించగలను?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల కేటాయింపులపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, అసలు రైతుల హక్కులపై నెలకొన్న సందేహాల నేపథ్యంలో ఈ వ్యవహారం మహారాష్ట్రలో రాజకీయంగా చర్చకు దారితీస్తోంది.

యూపీలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాకు ముందే 16.18 లక్షల దరఖాస్తులకు ఆమోదం

- **ఈసీఐ ఆదేశాలంటూ వివరాల వెల్లడికి నిరాకరణ**
- **సీఈవో వాదనలపై 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' పరిశోధనాత్మక కథనంలో ప్రశ్నలు**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కాకముందే కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి ఏకంగా 16.18 లక్షల ఫారం–6 దరఖాస్తులను స్వీకరించి ఆమోదించడం వివాదానికి దారితీసింది. ఈ దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయకపోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలే కారణమంటూ ఉత్తరప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నవదీప్ రిన్వా చేసిన వాదనలను 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రశ్నించింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ముసాయి దా ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత ప్రారంభమయ్యే క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశలోనే కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6 దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఓటర్లకు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకునే అవకాశం కూడా రాకముందే ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులను స్వీకరించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై తొలి విడత పరిశోధనాత్మక కథనం వెలువడిన అనంతరం స్పందించిన సీఈవో రిన్వా.. ముసాయిదా జాబితా విడుదలకు ముందే 16.18 లక్షల దరఖాస్తులను సేకరించిన విషయాన్ని 'ఎక్స్' వేదికగా అంగీకరించారు. ఎన్నికల నిబం ధనల ప్రకారం ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత అందిన దరఖాస్తుల వివరాలను మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే ముందుగా వచ్చిన దరఖాస్తుల సమాచారాన్ని బహిర్గతం చేయలేదని సమర్థిం చుకున్నారు. మరోవైపు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా 96.27 శాతం దరఖాస్తులు ఆమోదం పొందడంపై వివరణ కోరగా, తాము సందేహాలను నివృత్తి చేసే కస్సల్టెన్సీని నిర్వహించడం లేదంటూ సీఈవో ఫోన్ సంభాషణను ముగించినట్లు కథనం పేర్కొంది. అయితే ఆయన ప్రస్తావించిన కేంద్ర ఎన్నికల సంఘం అంతర్గత మార్గదర్శకాలను పరిశీలించినప్పుడు ఆ వాదనలకు మద్దతు లభించలేదని 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' వెల్లడించింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు ముందే దరఖాస్తులను స్వీకరించేందుకు ఉత్తరప్రదేశ్‌కు ప్రత్యేక మినహాయింపులు ఏవీ లేవని కథనం స్పష్టం చేసింది. ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారి వివరాలతో పాటు, బూత్ లెవల్ అధికారులు క్రోడీకరించే ఫారం–9 సమాచారాన్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉండే పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో భారీ సంఖ్యలో దరఖాస్తులను ముందుగానే స్వీకరించడం, వాటి వివరాలను వెల్లడించకపో వడం, అసాధారణ స్థాయిలో ఆమోదాలు నమోదవడంపై మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలు

జేఎన్‌యూ ప్రొఫెసర్ తొలగింపు

డెక్కన్ : విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) ఓ ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగిం చింది. విశ్వవిద్యాలయం అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) నిర్వహించిన విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. సామాజిక శాస్త్రాల విభాగంలోని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ సిస్టమ్స్‌లో పనిచేస్తున్న ప్రొఫెసర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సదరు అధ్యాపకుడు తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ కొద్ది రోజుల క్రితం పలువురు విద్యార్థినులు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠాలు బోధించే పేరుతో విద్యార్థినులను తన ఇంటికి రావాలని కోరేవాడని, అక్కడికి వెళ్లిన వారితో అసభ్యంగా ప్రవర్తించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచా రం. తరగతి గదిలో బోధించే సమయంలోనూ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసేవాడని విద్యార్థినులు ఆరోపించారు. ఈ వేధింపులతో విసిగిపోయిన వారు యూనివర్సిటీ అధికారులను ఆశ్రయించడంతో అంతర్గత ఫిర్యాదుల కమిటీ కేసును స్వీకరించి విచారణ చేపట్టింది. విద్యార్థినుల ఫిర్యాదులు, సంబంధిత అంశాలను పరిశీలించిన అనంతరం ప్రొఫెసర్ తప్పు చేసినట్లు కమిటీ నిర్ధారించినట్లు విశ్వవిద్యాలయం వెల్లడిం చింది. దీంతో ఆయనను విధుల నుంచి తొలగించడం తోపాటు, మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసింది. మరోవైపు, ఈ వ్యవహారంపై ఢిల్లీ మహిళా కమిషన్ కూడా స్పందించింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలను సుమోటోగా స్వీకరించిన కమిషన్.. దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జేఎన్‌యూ అధికారులను ఆదేశించింది. మూడు రోజుల్లోగా నివేదిక అందించాలని విశ్వవిద్యాలయ ఉపకులపతికి సూచించింది. అలాగే, వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం, పోష్ చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ ఘటన నేపథ్యంలో విద్యాసంస్థల్లో మహిళల భద్రత, లైంగిక వేధింపుల ఫిర్యాదులపై సమర్థవంతమైన విచారణ, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి.

రియాద్ విమానాశ్రయాలపై హౌతీల దాడులు

ముగ్గురు మృతి, 36 మందికి గాయాలు

రియాద్: సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో భారీ పేలుళ్లు కలకలం సృష్టించాయి. నగరంలోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు దాడులకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనల్లో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 36 మంది గాయపడినట్లు సౌదీ జనరల్ అథారిటీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (జీఏసీఏ) వెల్లడించింది. దాడుల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పరిణామాల కారణంగా భద్రతా పరమైన ఆందోళనలు నెలకొనడంతో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో విమానయాన సంస్థలు రియాద్‌కు వెళ్లే విమాన సర్వీసులను అక్టోబర్ 10 వరకు రద్దు చేశాయి. దీంతో సౌదీ అరేబియాకు ప్రయాణించాల్సిన ప్రయాణికులు తమ విమానాల తాజా పరిస్థితిని సంబంధిత విమానయాన సంస్థల ద్వారా తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉద్యోగుల కష్టానికి ఖరీదైన కానుక

- **బీఎండబ్ల్యూ కార్లు గిఫ్ట్‌గా ఇచ్చిన బాస్**
- **చలిలో స్కూటర్లపై వస్తున్న సిబ్బందిని చూసి చలించిన యజమాని**
- **ఒక్కో కారు విలువ రూ.43 లక్షలు**

చైనా: తన కోసం అహర్నిశలు శ్రమించే ఉద్యోగులు చలిలో వణుకుతూ ఎలక్ట్రిక్ స్కూటర్లపై విధులకు రావడం చూసి ఓ సంస్థ యజమానురాలి మనసు కరిగిపోయింది. తాను కారులో వెచ్చగా, సౌకర్యంగా ప్రయాణిస్తుంటే.. తన సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగులు మాత్రం వాతావరణ ప్రతికూలతలను ఎదుర్కోవడం ఆమెను ఆలోచింపజేసింది. దీంతో వారి కష్టాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఏకంగా బీఎండబ్ల్యూ కార్లను కానుకగా అందించారు. ఒక్కో కారు విలువ సుమారు రూ.43 లక్షలు కావడం విశేషం. చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న ఈ ఉదంతం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హెనాన్ ప్రావిన్స్‌లోని జియాజువో నగరానికి చెందిన మా యాన్‌లీ ఓ బీఫ్ హాట్‌పాట్ రెస్టారెంట్ చైన్‌ను నిర్వహిస్తున్నారు. తన సంస్థలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారికి ఖరీదైన కార్లను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 24న కొందరు ఉద్యోగులను సమావేశం ఉందని చెప్పి బీఎండబ్ల్యూ షోరూమ్‌కు తీసుకెళ్లారు. సాధారణ సమావేశమేనని భావించిన ఉద్యోగులు అక్కడికి చేరుకున్నాక తమకు కొత్త కార్లను కానుకగా ఇవ్వనున్నట్లు తెలుసుకుని ఆశ్చర్యానికి గురయ్యారు. తాను కారులో వెచ్చగా, సౌకర్యంగా ప్రయాణిస్తుంటే.. తన కోసం పనిచేసే సిబ్బంది మాత్రం చలిని తట్టుకుంటూ విధులకు రావాల్సి రావడం ఆమెను కలచివే

దక్షిణాఫ్రికా దెబ్బకు
ఆసీస్ విలవిల

- తొలి టెస్టులో మొదటిరోజు 187/6

దర్బన్: దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభించడంతో ఆస్ట్రేలియా తొలి టెస్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 187 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. వెలుతురు లేమి కారణంగా నిర్ణీత సమయానికి 24.4 ఓవర్ల ముందే ఆటను నిలిపివేశారు. మూడు టెస్టుల ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం కింగ్స్‌మీడ్‌లో ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. వియాన్ ముల్డర్ రెండు, మార్కో యాన్సెన్ ఒక వికెట్ తీయడంతో ఆసీస్ 24 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ట్రావిస్ హెడ్ (9), 2016 తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన నిక్ మాడిస్సన్ (0) నిరాశపరిచారు. స్టీవ్ స్మిత్ (25), మార్నస్ లబుషేన్ (37) మూడో వికెట్‌కు 60 పరుగులు జోడించినా, ఇద్దరూ వెనుదిరగడంతో ఆస్ట్రేలియా కష్టాల్లో పడింది. లబుషేన్‌ను ముల్డర్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. అనంతరం అనిచ్ నోర్జే వరుస బంతుల్లో అలెక్స్ క్యారీ (14), బ్యూ వెబ్‌స్టర్ (4)లను పెవిలియన్‌కు పంపాడు. ఒక దశలో 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను మాట్ రెన్షా (46 నాటౌట్), పాట్ కమిన్స్ (33 నాటౌట్) ఆదుకున్నారు. ఏడో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జోడించి జట్టును మెరుగైన స్థితికి చేర్చారు. 2025 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన దక్షిణాఫ్రికా ప్రస్తుత ఛాంపియన్‌గా బరిలోకి దిగింది. 2018 బాల్ ట్యాంపరింగ్ వివాదం తర్వాత ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాలో టెస్టు పర్యటనకు రావడం ఇదే తొలిసారి.

విండీస్ విధ్వంసం

- రెండో టీ20లో భారత్ చిత్తు
- 249 పరుగుల లక్ష్యాన్ని 18.3 ఓవర్లలోనే ఛేదించిన కరీబియన్లు
- శతకంతో చెలరేగిన కెప్టెన్ హోప్
- అర్ధ సెంచరీతో రాణించిన రూథర్‌ఫోర్డ్
- 5మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో సమం

రాంచీ: భారత బౌలర్లపై వెస్టిండీస్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (84) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో రెండో టీ20లో భారత్‌పై విండీస్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని కరీబియన్లు 18.3 ఓవర్లలోనే ఛేదించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సమమైంది. ఛేదనలో హోప్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 45 బంతుల్లోనే తొమ్మిది సిక్సర్లు, ఆరు ఫోర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు రూథర్‌ఫోర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. వీరిద్దరి ధాటికి విండీస్ రికార్డు స్థాయి ఛేదనతో విజయాన్ని అందుకుంది. మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినా భారత్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. సంజూ శాంసన్ 41 బంతుల్లో 82 పరుగులతో మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ 22 బంతుల్లో 43, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 18 బంతుల్లో 40 పరుగులు చేయగా.. తిలక్ వర్మ 18 బంతుల్లో 44 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయితే భారీ స్కోరు కూడా భారత్‌కు విజయాన్ని అందించలేకపోయింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ నాలుగు ఓవర్లలో 24 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

ఐపీఎల్ 20వ సీజన్‌పై
బీసీసీఐ కసరత్తు

- ఈనెల 15న కీలక భేటీకి ఏర్పాట్లు
- ఫ్రాంచైజీల యజమానులు, సీఈవోలు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు, ప్రసార సంస్థలకు ఆహ్వానం
- గత సీజన్ల సమీక్ష.. 2027 నిర్వహణపై చర్చ

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 20వ సీజన్ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ 2027 నిర్వహణ ప్రణాళికలపై చర్చించేందుకు ఈ నెల 15న ముంబైలో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ భేటీకి ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులు, ఆయా జట్ల ముఖ్య కార్యనిర్వహణాధికారులు (సీఈవోలు), గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన రాష్ట్ర క్రికెట్ సంఘాలు, ప్రసార సంస్థల ప్రతినిధులను బీసీసీఐ ఆహ్వానించింది. గత సీజన్లలో ఎదురైన సమస్యలు, నేర్చుకున్న పాఠాలను సమీక్షించడంతో పాటు వివిధ వర్గాల ఆందోళనలు, సూచనలను చర్చించనుంది. ఐపీఎల్ నిర్వహణలో రాష్ట్ర క్రికెట్ సంఘాల పాత్ర కీలకమని బీసీసీఐ భావిస్తోంది. మ్యాచ్ రోజున సమన్వయం, స్టేడియాల్లో ఏర్పాట్లు, వేదికల నిర్వహణకు సంబంధించి సంఘాల అభిప్రాయాలను తెలుసుకోనుంది. 2027 సీజన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలపైనా సమావేశంలో చర్చించనుంది. గత నెలలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ముగిసిన అనంతరం, ఐపీఎల్ రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 20వ సీజన్‌ను ఘనంగా నిర్వహించాలని బీసీసీఐ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ప్రకటించింది.

బంగ్లాతో తొలి పోరు

- ఈ నెల 27 నుంచి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ
- స్వర్ణ విజేతగా బరిలోకి దిగనున్న భారత జట్టు
- జలంధర్, మొహాలీ వేదికల్లో మ్యాచ్‌లు.. నవంబర్ 5న ఫైనల్

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల హాకీ స్వర్ణ విజేత భారత్.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో తన తొలి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. అక్టోబర్ 27న పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ పోరు జరగనుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు జరిగే ఈ టోర్నీకి జలంధర్, మొహాలీ ఆతిథ్యమివ్వనున్నాయి. ఐదుసార్లు టైటిల్ గెలిచిన భారత్.. మరోసారి విజేతగా నిలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. జలంధర్‌లోని ఒలింపియన్ సుర్జీత్ సింగ్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం పోటీలు మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియానికి మారతాయి. నవంబర్ 4న సెమీఫైనల్స్, నవంబర్ 5న కాంస్య, స్వర్ణ పతకాల కోసం మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రారంభ వేడుకలు అక్టోబర్ 27న భారత్–బంగ్లాదేశ్ మ్యాచ్‌కు ముందు జరగనున్నాయి.

భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్

భారత్‌తో పాటు మలేషియా, జపాన్, దక్షిణ కొరియా, చైనా, బంగ్లాదేశ్ టోర్నీలో పాల్గొంటాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా ఐదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ లీగ్ మ్యాచ్‌లన్నీ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడే భారత్.. 29న చైనాతో, 30న జపాన్‌తో, నవంబర్ 1న మలేషియాతో, 2న దక్షిణ కొరియాతో తలపడుతుంది. అక్టోబర్ 28, 31, నవంబర్ 3 తేదీల్లో విశ్రాంతి దినాలుగా నిర్ణయించారు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో భారత్ అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచింది. 2011, 2016, 2023, 2024లో టైటిల్ సాధించగా.. 2018లో పాకిస్థాన్‌తో కలిసి సంయుక్త విజేతగా నిలిచింది. జపాన్‌లో ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత జట్టు.. ఈ టోర్నీలోనూ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటించడంతో టోర్నీపై ఉత్కంఠ పెరిగిందని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తెలిపారు. ఆసియా దేశాల జట్లకు పంజాబ్ స్వాగతం పలుకుతోందని, నాణ్యమైన హాకీ పోటీలు చూడాలని ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకటనతో టోర్నీకి కౌంటౌన్ ప్రారంభమైందని హాకీ ఇండియా ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్ అన్నారు.

మారుమూల ప్రాంతాలకూ
బ్లూ డార్ట్ సేవలు

- తపాలా శాఖతో ఒప్పందం
- చిన్న పట్టణాలకూ పార్శిళ్ల డెలివరీ

ముంబై: మూడో, నాలుగో శ్రేణి పట్టణాలు, మారుమూల ప్రాంతాలకు పార్శిళ్ల డెలివరీ సేవలను విస్తరించేందుకు బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్, భారత తపాలా శాఖ శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. తపాలా శాఖ విస్తృత నెట్‌వర్క్, రవాణా మౌలిక వసతులను వినియోగించుకుంటూ సేవలను దశలవారీగా విస్తరించనున్నాయి. ఈ భాగస్వామ్యంతో చిన్న, మధ్య తరహా సంస్థలు, ఈ–కామర్స్ విక్రేతలు మరిన్ని ప్రాంతాల్లోని వినియోగదారులకు తమ ఉత్పత్తులను చేరవేసేందుకు వీలవుతుందని బ్లూ డార్ట్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ దీపాంజన్ బెనర్జీ తెలిపారు. పార్శిళ్ల డెలివరీ సేవలను బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకమని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాల్ఫోర్ మాన్యుయెల్ పేర్కొన్నారు. భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని తపాలా శాఖ కార్యకలాపాల విభాగం సభ్యుడు హర్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు.

16 నుంచి భారత్–జింబాబ్వే
మహిళల టీ20 సిరీస్

- రాయ్‌పూర్ వేదికగా జరగనున్న మ్యాచ్‌లు

రాయ్‌పూర్: భారత్–జింబాబ్వే మహిళల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. ఈ నెల 16 నుంచి 20 వరకు నయా రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతి మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుందని ఛత్తీస్‌గఢ్ క్రికెట్ సంఘం డైరెక్టర్ విజయ్ షా శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో లావాదేవీలో గరిష్ఠంగా ఆరు టికెట్లు కొనుగోలు చేయవచ్చు. మూడు మ్యాచ్‌ల సిరీస్ టికెట్ ధర రూ.499గా, రెండు మ్యాచ్‌ల కాంబో టికెట్ ధర రూ.350గా నిర్ణయించారు. వ్యక్తిగత మ్యాచ్ టికెట్లు సిల్వర్ విభాగంలో రూ.2,000, గోల్డ్ రూ.2,500, ప్లాటినం రూ.3,500గా ఉన్నాయి. కార్పొరేట్ బాక్స్‌లో ఒక్క సీటుకు రూ.3,500, పూర్తి బాక్స్‌కు రూ.70,000 చెల్లించాలి. స్టేడియంలో భూగర్భ జలాల వినియోగంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో సిరీస్ నిర్వహణకు అవసరమైన అనుమతులు పొందినట్లు విజయ్ షా తెలిపారు.

Business బిజినెస్

లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎయిర్‌టెల్ మనీ

- కొన్నేళ్లలోనే అతిపెద్ద ఐపీఓగా నమోదు
- ఒక్కో షేరు ధర 1.96 పౌండ్లు
- సంస్థ విలువ 700కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ: ఆఫ్రికాకు చెందిన డిజిటల్ ఆర్థిక సేవల వేదిక ఎయిర్‌టెల్ మనీ శుక్రవారం లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అడుగుపెట్టింది. కొన్నేళ్లలో ఈ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన అతిపెద్ద ప్రాథమిక పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)గా ఇది నిలిచింది. ఒక్కో షేరు ఇష్యూ ధరను 1.96 పౌండ్లుగా నిర్ణయించగా, సంస్థ మార్కెట్ విలువ సుమారు 700 కోట్ల డాలర్లుగా అంచనా వేశారు. ఎయిర్‌టెల్ మనీ షేర్ల ఆఫర్‌కు అధిక స్పందన లభించడం బ్రిటన్ మార్కెట్లో నాణ్యమైన పెట్టుబడి అవకాశాలపై ఆసక్తిని సూచిస్తోందని భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ మిట్టల్ అన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలమైన వ్యాపార, విధాన వాతావరణం బ్రిటన్‌లో ఉందని పేర్కొన్నారు. 2019లో ఎయిర్‌టెల్ ఆఫ్రికాను లండన్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసిన అనుభవం ఈ నిర్ణయానికి దోహదపడిందని తెలిపారు. ఎయిర్‌టెల్ మనీలో భారతీ ఎయిర్‌టెల్‌కు పరోక్షంగా సుమారు 61.6 శాతం ఆర్థిక వాటా ఉంది. భారతీ ఎయిర్‌టెల్‌కు ఎయిర్‌టెల్ ఆఫ్రికాలో 79.2 శాతం వాటా ఉండగా, ఎయిర్‌టెల్ ఆఫ్రికాకు ఎయిర్‌టెల్ మనీలో 77.85 శాతం వాటా ఉంది. ప్రారంభ దశలో షేర్లు సుమారు 2 పౌండ్లకు చేరి, ఆ తర్వాత 1.94 పౌండ్లకు తగ్గాయి. ప్రస్తుతం కేటాయింపు పొందిన పెట్టుబడిదారులకే షేర్ల ట్రేడింగ్ పరిమితమైందని, అక్టోబర్ 14 నుంచి సాధారణ ట్రేడింగ్ ప్రారంభం కానుందని సంస్థ వెల్లడించింది. గతంలో అంచనా వేసిన 800–900 కోట్ల డాలర్ల విలువతో పోలిస్తే ప్రస్తుత మార్కెట్ విలువ తక్కువగా ఉంది.

బిగ్ బిలియన్ డేస్‌కు భారీ స్పందన!

- తొలి గంటలో ఒక్క నిమిషంలోనే 63 లక్షల మంది వినియోగం
- 34 శాతం పెరిగిన కొత్త వినియోగదారులు
- 60 శాతం డిమాండ్ చిన్న పట్టణాల నుంచే

బెంగళూరు: ఫ్లిప్‌కార్ట్ 13వ వార్షిక పండగ విక్రయాలు 'ది బిగ్ బిలియన్ డేస్'కు భారీ స్పందన లభిస్తోంది. విక్రయాల తొలి గంటలో ఒక నిమిషానికి 63 లక్షల మంది ఏకకాలంలో ప్లాట్‌ఫామ్‌ను వినియోగించినట్లు సంస్థ వెల్లడించింది. మొత్తం డిమాండ్‌లో 60 శాతం చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచే నమోదవగా, కొత్త వినియోగదారుల సంఖ్య 34 శాతం పెరిగింది. అక్టోబర్ 8 అర్ధరాత్రి ప్రారంభమైన ముందస్తు విక్రయాల్లో 28.7 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయి. స్మార్ట్‌ఫోన్లలో ప్రీమియం మోడళ్లకు ఆదరణ లభించగా, ప్రతి నలుగురిలో ఒకరు పాత ఫోన్ మార్పిడిని, ముగ్గురిలో ఒకరు వడ్డీ లేని వాయిదా చెల్లింపులను ఎంచుకున్నారు. పెద్ద గృహోపకరణాల విక్రయాలు 30 శాతం, ట్యాబ్లెట్ల అమ్మకాలు 73 శాతం పెరిగాయి. సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విక్రయాలు 42 శాతం వృద్ధి చెందాయి. అత్యధిక డిమాండ్ సమయంలో నిమిషానికి 1,600కు పైగా పురుషుల పరిమళ ద్రవ్యాలు అమ్ముడయ్యాయి. యువతలో సౌందర్య ఉత్పత్తుల విక్రయాలు 48 శాతం, గడియారాల అమ్మకాలు 42 శాతం పెరిగాయి. త్వరిత సరఫరా విభాగమైన ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ఆర్డర్లు సాధారణ రోజులతో పోలిస్తే 3.5 రెట్లు పెరిగాయి. తొలి గంటలో కొత్త వినియోగదారుల సంఖ్య 11 రెట్లు అధికమైంది. ముందస్తు విక్రయాల్లో ఢిల్లీలో ఓ వినియోగదారుడికి ఐఫోన్ 17ను 3.4 నిమిషాల్లోనే అందించినట్లు సంస్థ తెలిపింది. తొలి రోజు విక్రయాల్లో పాల్గొన్న వ్యాపారుల్లో 51 శాతం మంది సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు వృద్ధిని నమోదు చేశారు. చిన్న పట్టణాల్లోని సూక్ష్మ, చిన్న వ్యాపారాల అమ్మకాలు 2.9 రెట్లు పెరిగాయి.

స్టాక్ మార్కెట్‌కు మళ్లీ జోష్!

- ఒక్కరోజే 879 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 1.30 శాతం లాభంతో 22,520కి నిఫ్టీ
- ఐటీ షేర్ల ర్యాలీ.. తగ్గిన ముడిచమురు ధరలు

ముంబై: వరుసగా రెండు రోజుల భారీ నష్టాల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల జోరు, ముడిచమురు ధరల తగ్గుదలతో సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 879.09 పాయింట్లు (1.23 శాతం) పెరిగి 72,472.33 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 288.65 పాయింట్లు (1.30 శాతం) లాభంతో 22,520.45 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర 1.32 శాతం తగ్గి బ్యారెల్‌కు 102.90 డాలర్లకు చేరింది. సెన్సెక్స్ షేర్లలో ఐటీసీ 4.78 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 4.23 శాతం లాభపడ్డాయి. జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో టీసీఎస్ నికర లాభం 15 శాతం పెరిగి రూ.13,884 కోట్లకు చేరడం ఐటీ రంగంలో కొనుగోళ్లకు ఊతమిచ్చింది. అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లూ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒక్కటే నష్టపోయింది.

అన్ని రంగాల్లోనూ కొనుగోళ్లు

బీఎస్ఈలో ఐటీ సూచీ 2.91 శాతం, ఆసుపత్రుల రంగం 2.46 శాతం, ఎఫ్ఎంసీజీ 2.02 శాతం పెరిగాయి. మిడ్‌క్యాప్ సూచీ 1.59 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.56 శాతం లాభపడ్డాయి. మొత్తం 2,516 షేర్లు లాభాల్లో ముగియగా, 1,867 నష్టపోయాయి. మరో 227 షేర్లలో మార్పు లేదు. అమెరికా–ఇరాన్ మధ్య తక్షణ సైనిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశాలు తగ్గాయన్న సంకేతాలతో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. దీంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కొంత తగ్గి, మదుపర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరిగిందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. టీసీఎస్ త్రైమాసిక ఫలితాలు, ఐటీ రంగంలో కృత్రిమ మేధ ఆధారిత ఆదాయ వృద్ధిపై అంచనాలూ మార్కెట్‌కు మద్దతిచ్చాయని తెలిపారు. వారాంతపు లెక్కల్లోనూ మార్కెట్లు లాభాల్లో నిలిచాయి. సెన్సెక్స్ 562.63 పాయింట్లు (0.78 శాతం), నిఫ్టీ 98.50 పాయింట్లు (0.43 శాతం) పెరిగాయి. అయితే, గురువారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.12,943.58 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు ఎక్స్ఛేంజీల గణాంకాలు వెల్లడించాయి.

డీలర్ల బాటలో ఓలా ఎలక్ట్రిక్!

- దేశవ్యాప్తంగా విక్రయ, సేవల నెట్‌వర్క్ విస్తరణ
- 150 మంది డీలర్లతో తొలి సమావేశం

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ దేశవ్యాప్తంగా విక్రయాలు, సర్వీసుల నెట్‌వర్క్‌ను విస్తరించడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా తమిళనాడులోని తన గిగా, ఫ్యూచర్ ఫ్యాక్టరీల్లో శుక్రవారం సుమారు 150 మంది డీలర్లతో తొలి సమావేశాన్ని నిర్వహించింది. డీలర్ల తయారీ కేంద్రాలను సందర్శించి స్కూటర్లు, బ్యాటరీ ప్యాక్‌లు, మోటార్ల తయారీ ప్రక్రియను పరిశీలించడం తో పాటు సంస్థ నాయకత్వ బృందంతో సమావేశమయ్యారు. ఇప్పటికే పలువురు షోరూమ్‌లను ప్రారంభించగా, మరికొన్ని త్వరలో అందుబాటులోకి రానున్నాయి. డీలర్ల స్పందనపై సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ హర్షం వ్యక్తం చేశారు. 2021 నుంచి కొనసాగుతున్న సొంత షోరూమ్‌ల విధానంలో మార్పులు చేస్తూ, 2026 ఆగస్టులో డీలర్ల భాగస్వామ్యంతో విక్రయాలు, సేవల నెట్‌వర్క్ విస్తరణను సంస్థ ప్రకటించింది. సొంత కేంద్రాలు బ్రాండ్, ఉత్పత్తుల అనుభవానికి ప్రాధాన్యమిస్తే.. స్థానికంగా అమ్మకాలు, సర్వీసులను డీలర్లు నిర్వహిస్తారు. ఇప్పటికే ఉన్న 10 లక్షలకు పైగా ఓలా వాహన వినియోగదారుల నెట్‌వర్క్ ఈ విస్తరణకు తోడ్పడనుంది. జన్మాష్టమి సందర్భంగా తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో తొలి విడత షోరూమ్‌లు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మార్పుల ప్రక్రియకు మార్గనిర్దేశం చేసేందుకు హ్యుందాయ్ మోటార్ ఇండియా మాజీ అధ్యక్షుడు బీవీఆర్ సుబ్బును సీనియర్ సలహాదారుగా నియమించింది.

ఇన్‌స్టామార్ట్‌లో
పండగ ఆఫర్ల జాతర

బెంగళూరు: పండగల సీజన్ సందర్భంగా ఇన్‌స్టామార్ట్ 'క్విక్ ఇండియా మూవ్‌మెంట్ సేల్'ను ప్రారంభించింది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, అందం, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, బొమ్మలు, నిత్యావసరాలపై ఎంపిక చేసిన వస్తువులకు 50–90 శాతం వరకు తగ్గింపులు ప్రకటించింది. యాపిల్ ఐఫోన్ 17 ప్రో రూ.1,19,999, శాంసంగ్ ఫోన్లు రూ.10,999 నుంచి, మ్యాక్‌బుక్‌లు రూ.66,900 నుంచి అందుబాటులో ఉన్నాయి. నిత్యావసరాలు రూ.9 నుంచి, బొమ్మలు రూ.89 నుంచి లభిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డులతో ఎంపిక చేసిన వస్తువులపై రూ.5,500 వరకు ఆదా చేసుకోవచ్చు. కొన్ని బ్యాంకు కార్డులతో 10 శాతం తగ్గింపు, స్విగ్గీ హెచ్‌డీఎఫ్‌సీ కార్డుతో కొనుగోళ్లపై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తున్నారు. ఎంపిక చేసిన ఉత్పత్తులు, ప్రాంతాల్లో, నిల్వలు ఉన్నంత వరకే ఆఫర్లు వర్తించనున్నాయి. ఇన్‌స్టామార్ట్ ప్రస్తుతం 130కిపైగా నగరాల్లో 50వేలకు పైగా ఉత్పత్తులను అందిస్తోంది.

‘రణబాలి’ నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘రణబాలి’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. విజయదశమి సందర్భంగా ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో చిత్ర ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. మరో ఎనిమిది రోజుల్లో దసరా పండుగకు ‘రణబాలి’ ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. మనకు తెలియకుండా దాచిన చరిత్రను, ప్రజలకు తెలియకూడదని భావించిన వీరుల కథలను, జానపదాలు, బుర్రకథల రూపంలో తరతరాలకు అందించిన గాథలను మరోసారి ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నమే ఈ సినిమా అని వివరించారు. ఆ వీరులను గౌరవిస్తూ, వారి చరిత్రను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు పెద్ద తెరపై చూసి అనుభూతి చెందేలా ‘రణబాలి’ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ‘టాక్సీవాలా’ కథ విన్నప్పుడే రాహుల్ సంకృత్యన్ ఎంత గొప్ప రచయితనో తనకు అర్థమైందని, ‘రణబాలి’ కథ చెప్పినప్పుడు ఈ ఏడాది తెలుగు సినిమా నుంచి వస్తున్న గొప్ప కథల్లో ఇదొకటిగా అనిపించిందని విజయ్ పేర్కొన్నారు. కథానాయకుడు రణబాలి, జయమ్మ, హెక్టార్ వంటి పాత్రలతో పాటు కథ జరిగే గ్రామం, తన తల్లి ఊరైన శింగనమల నేపథ్యాన్ని కూడా దర్శకుడు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. కరువు అనే అంశాన్ని మన సంస్కృతికి అనుసంధానిస్తూ, మాస్ హీరోయిజంతో పాటు అనేక భావోద్వేగాలు, అంతర్లీన అంశాలను ఒకే లక్ష్యంతో ముడిపెట్టి రాహుల్ ఈ కథను రూపొందించారని చెప్పారు. ఇంతటి గొప్ప కథను రాహుల్ మళ్లీ రాస్తారో లేదో తెలియదని, తన కెరీర్‌లో ‘రణబాలి’ ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచిపోతుందని నమ్ముతున్నానని వెల్లడించారు. ప్రేక్షకులంతా ఈ నెల 16న తప్పకుండా సినిమాను చూడాలని, తమ కుటుంబ సభ్యులకు కూడా చూపించాలని విజ్ఞప్తి చేశారు. మన పూర్వీకులు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొని ప్రస్తుత స్థాయికి చేరుకున్నారో, మనలో ఎలాంటి వారసత్వం, స్ఫూర్తి ఉన్నాయో తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాలని అన్నారు. ఈ చిత్రంలో భాగమైనందుకు గర్వంగా ఉందని పేర్కొన్న విజయ్.. ఈ కార్యక్రమానికి రష్మిక హాజరు కాలేకపోయినందుకు తన తరఫున క్షమాపణలు తెలిపారు. ఇదే సమయంలో తనపై ప్రతికూల ప్రచారం చేస్తున్నవారిని ఉద్దేశించి కూడా ఆయన స్పందించారు. ఇతరులపై నెగెటివిటీ వ్యాప్తి చేయడం కంటే తమ జీవితాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నించా లని సూచించారు. తన కలలు, కష్టం ఇతరులకు అనవసరంగా అనిపించినంత మాత్రాన తాను ప్రయత్నించ డం ఆపలేనని, తన నిజాయితీని అహంకారంగా, ఆత్మవిశ్వాసాన్ని పొగరుగా భావించినంత మాత్రాన మారాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

డబ్బు కోసమే సినిమాల్లోకి వచ్చా

దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక శ్రుతి హాసన్.. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. స్టార్ హీరోల సరసన కథానాయికగా మెప్పించడమే కాకుండా, గాయనిగా, సంగీత కళాకారిణిగా, దర్శకురాలిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న శ్రుతి హాసన్.. ప్రస్తుతం ‘ట్రైన్’, ‘ఆకాశంలో ఒక తార’ వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం, నటిగా మారడానికి గల కారణాలు, బాలనటిగా తెరపై కనిపించిన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ప్రధాన కారణం డబ్బేనని శ్రుతి హాసన్ స్పష్టంగా చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తనకు మొదటి నుంచీ సంగీతంపై ప్రత్యేక ఆసక్తి ఉండేదని, సొంతంగా ఇండిపెండెంట్ మ్యూజిక్ ఆల్బమ్‌లు రూపొందించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చుకోవాలని అనుకునేదాన్నని తెలిపారు. అయితే, అలాంటి ఆల్బమ్‌లను స్వయంగా నిర్మించుకోవాలంటే డబ్బు అవసరమయ్యేదని, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలనే ఉద్దేశంతోనే సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. సరిగ్గా అదే సమయంలో బాలీవుడ్ నుంచి ‘లక్’ సినిమాలో నటించే అవకాశం వచ్చిందని, తన అవసరాలకు ఆ అవకాశం ఉపయోగపడుతుందని భావించి వెంటనే అంగీకరించినట్లు చెప్పారు. అలా మొదలైన తన నటనా ప్రయాణం అనుకోని మలుపు తీసుకుందని వివరించారు. ‘లక్’ సినిమా తర్వాత వరుసగా నటించే అవకాశాలు రావడంతో సినిమాలే తన ప్రధాన వృత్తిగా మారిపోయాయని శ్రుతి హాసన్ పేర్కొన్నారు. మొదట్లో సంగీతం కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సినిమాల్లోకి వచ్చినప్పటికీ, క్రమంగా నటనపై ఆసక్తి పెరిగిందని ఆమె మాటలను బట్టి అర్థమవుతోంది. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సంగీతంపై తనకున్న అభిరుచిని కొనసాగించడం విశేషం.

పూనమ్ కౌర్ సంచలన పోస్టులు

కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న నటి పూనమ్ కౌర్.. సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు చురుగ్గా ఉంటూ తన పోస్టులతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చేసిన కొన్ని వ్యాఖ్యలు టాలీవుడ్‌లో చర్చకు దారితీశాయి. ఓ దర్శకుడిని ఉద్దేశించినట్లుగా ఆమె చేసిన ఘాటు వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. తన పోస్టులో ఆ దర్శకుడి పేరు ప్రస్తావించకుండా.. ‘ఏమాత్రం ఆదర్శాలు లేని, వంద శాతం ప్రచారం చేసుకునే ఈ దర్శకుడి నుంచి నటీనటులను, నిర్మాతలను దేవుడే కాపాడాలి. హనీ ట్రాప్, మూఢనమ్మకాల వలలో చిక్కుకునేలా చేయడం ద్వారానే ఇతను తన జీవితాన్ని గడుపుతుంటాడు. ఈ వ్యక్తికి అసలు ఎలాంటి ఆదర్శాలు లేవు. కాబట్టి ఇతనికి దూరంగా ఉండండి. ఈ తాంత్రికుడు, నకిలీ గురువు నుంచి అమాయకులను ఆ దేవుడే కాపాడాలి’ అంటూ వ్యాఖ్యానించారు. అయితే, ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ పోస్టు పెట్టారనే విషయాన్ని స్పష్టంగా

వెల్లడించలేదు. అనంతరం మరో పోస్టులో ‘ఏకే అనేది మరో నటుడి విషయంలో అజ్ఞాతవాసి లాంటిది.. అంతే’ అంటూ పేర్కొన్నారు. దీంతో పూనమ్ కౌర్ పరోక్షంగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారంటూ కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై ఆమె నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: AK47’ సినిమా విడుదల వాయిదా పడిన నేపథ్యంలోనే పూనమ్ ఈ పోస్టులు పెట్టి ఉంటారనే ఊహాగానాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు, వాటి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటన్న అంశంపై టాలీవుడ్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

చిన్నప్పటి నుంచే పవన్ కల్యాణ్ నా క్రష్

తెలుగు, తమిళ చిత్రాల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఆనంది.. తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలతో ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. తన కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమెకు ఇష్టమైన కథానాయకుడి గురించి ప్రశ్న ఎదురైంది. దీనికి ఆనంది ఆసక్తికరంగా స్పందిస్తూ.. తాను జనసేనాని, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్‌కు వీరాభిమానినని వెల్లడించారు. చిన్నప్పటి నుంచే ఆయనంటే తనకు ఎంతో ఇష్టమని, నిజం చెప్పాలంటే బాల్యం నుంచే పవన్ కల్యాణ్ తన క్రష్ అని చిరునవ్వుతో తన మనసులోని మాటను బయటపెట్టారు. వెండితెరపై పవన్ కల్యాణ్ ప్రదర్శించే మ్యానరిజమ్స్, ఆయన విలక్షణమైన స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని ఆనంది తెలిపారు. ఆయన సినిమా విడుదలవుతుందంటే చాలు అభిమానుల్లో పండగ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. నటిగా ఎదిగి సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్‌పై తనకున్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. తన అభిమాన నటుడి గురించి ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

‘ఫౌజీ’, ‘స్పిరిట్’ నుంచి స్పెషల్ అప్‌డేట్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే వార్త అందుతోంది. ఆయన నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాలు ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ నుంచి అక్టోబర్ 23న ప్రత్యేక అప్‌డేట్స్ రానున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఫౌజీ’ సినిమా విడుదల వాయిదా పడినట్లు చిత్రబృందం స్పష్టం చేసిన నేపథ్యంలో.. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ నుంచి ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ‘స్పిరిట్’ నుంచి కూడా అదే రోజు అధికారిక పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఒకే రోజు రెండు సినిమాల నుంచి అప్‌డేట్స్ వస్తే అభిమానులకు డబుల్ ట్రీట్ అందినట్లేనని సినీ ప్రియులు భావిస్తున్నారు. ‘సీతారామం’ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హను రాఘవపూడి దర్శకత్వంలో ‘ఫౌజీ’ రూపొందుతోంది. 1940ల నాటి స్వాతంత్ర్య పూర్వ కాలం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాతలు రవి శంకర్, నవీన్ యెర్నేని భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. తొలుత ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించినప్పటికీ.. తాజాగా విడుదల వాయిదా పడినట్లు వెల్లడించారు. దీంతో ప్రభాస్ అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. అయితే, విడుదల తేదీ వాయిదా పడినప్పటికీ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నారనే ప్రచారం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో తెరకెక్కుతున్న ‘స్పిరిట్’పై కూడా భారీ అంచనాలు నెలకొన్నా యి. ఈ సినిమా నుంచి అక్టోబర్ 23న అధికారిక పోస్టర్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ రెండు సినిమాలకు అప్‌డేట్స్ ఒకే రోజు వెలువడితే సోషల్ మీడియాలో ప్రభాస్ అభిమానుల సందడి పెరిగే అవకాశం ఉంది. ‘ఫౌజీ’ గ్లింప్స్, ‘స్పిరిట్’ పోస్టర్ విడుదలకు సంబంధించి అధికారిక ప్రకటన కూడా వెలువడాల్సి ఉంది.

దుష్ప్రచారంతోనే నా కెరీర్ దెబ్బతింది..

ఒకప్పుడు బుల్లితెరపై స్టార్ యాంకర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఉదయభాను.. తన కెరీర్‌లో ఎదురైన చేదు అనుభవాలపై తాజాగా స్పందించారు. సుదీర్ఘ విరామం తర్వాత నిర్మాతగా మళ్లీ సినీ, వినోద రంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. తన కెరీర్ దెబ్బతినడానికి ప్రతిభ లేకపోవడం కారణం కాదని, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చేసిన దుష్ప్రచారమే ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తనకు అవకాశాలు తగ్గిపోవడానికి దారితీసిన పరిణామా లను వెల్లడించారు. తనకంటూ సొంతంగా ‘ఉదయభాను ప్రొడక్షన్స్’ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసిన ఆమె.. తొలి ప్రయత్నంగా ‘పంచనామా’ అనే వెబ్ సిరీస్‌ను నిర్మించారు. ఈ వెబ్ సిరీస్ ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఉదయభాను.. గతంలో ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ఓ సందర్భంలో టీవీ చానల్ ఎండీతో మాట్లాడుతున్న సమయంలో, పక్కనే ఉన్న మార్కెటింగ్ విభాగానికి చెందిన వ్యక్తి తన పారితోషికం గురించి తప్పుదు సమాచారం ఇచ్చారని తెలిపారు. ‘భాను గారు రూ.6 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఆమె రెమ్యునరేషన్ చాలా ఎక్కువ’ అని సదరు వ్యక్తి చెప్పారని వెల్లడించారు. అయితే, తాను వాస్తవానికి అంత మొత్తం అడగలేదని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాల కారణంగా తనకు రావాల్సిన అవకాశాలు చేజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంచి డ్యాన్స్ నైపుణ్యాలు, యాంకరింగ్‌లో సుదీర్ఘ అనుభవం, ప్రేక్షకుల్లో గుర్తింపు ఉన్నప్పటికీ పలు టీవీ చానళ్లు తనను పక్కన పెట్టాయని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లినప్పటికీ, స్టేజ్‌పైకి వెళ్లే సమయానికి అవకాశం దక్కకపోవడంతో కారులోనే ఎదురుచూసి వెనుదిరగాల్సి వచ్చిందని చెప్పారు. వృత్తిపట్ల ఎంతో అంకితభావంతో పనిచేసినప్పటికీ తనకు క్రమశిక్షణ లేదంటూ కొందరు అసత్య ప్రచారాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కెరీర్ దెబ్బతినడంలో కొంతమంది పీఆర్వోల పాత్ర కూడా ఉందని ఉదయభాను ఆరోపించారు. ప్రతిభ, అనుభవం, ప్రేక్షకుల్లో ఆదరణ ఉన్నప్పటికీ తప్పుడు ప్రచారాల వల్ల అవకాశాలకు దూరమయ్యానని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

‘వెట్టువం’లో దుల్కర్ సల్మాన్..



కోలీవుడ్ విలక్షణ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా యాక్షన్ చిత్రం ‘వెట్టువం’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్య, శోభితా ధూళిపాళ్ల, వి.ఆర్. దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే చాలా వరకు పూర్తయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సినిమా షూటింగ్ దాదాపు ముగిసిందని భావిస్తున్న తరుణంలో దర్శకుడు పా. రంజిత్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చిత్రానికి మరింత ప్రత్యేకత తీసుకురావడంతో పాటు కథలో ఆసక్తికరమైన మలుపును జోడించే ఉద్దేశంతో మరో మూడు రోజుల పాటు అదనపు చిత్రీకరణ చేపట్టాలని చిత్రబృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కూడా పాల్గొననున్నట్లు సమాచారం. తక్కువ నిడివి ఉన్నప్పటికీ కథపై గట్టి ప్రభావం చూపిన ఆ పాత్ర తరహాలోనే ‘వెట్టువం’లో దుల్కర్ సల్మాన్ క్యామియో కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. ఆయన పాత్ర సినిమా కథను కీలక మలుపు తిప్పడంతో పాటు ప్రేక్షకులకు ఉత్కంఠను కలిగిస్తుందని సినీ అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే, దుల్కర్ సల్మాన్ ఈ చిత్రంలో నటిస్తున్నారనే వార్తతో పాటు అదనపు షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సంక్రాంతి బరిలో వెంకీ, కళ్యాణ్ రామ్

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో, కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్న చిత్రం ‘జనవరి 12 విడుదల’. హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఊటీలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన నటీనటులతో పాటు సాంకేతిక బృందం కూడా పాల్గొంటోంది. తాజా షెడ్యూల్ పూర్తయ్యే సమయానికి సినిమా చిత్రీకరణ దాదాపు 85 శాతం ముగియనుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. దీంతో ఈ చిత్రం 2027 సంక్రాంతి విడుదలకు మరింత చేరువ కానుంది. ‘బావ బమ్మర్ది సౌజన్యంతో’ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు జి.వీ. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్తి స్థాయి వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా, తాజా షెడ్యూల్ ప్రారంభంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. అనిల్ రావిపూడి తనదైన కామెడీ, కుటుంబ భావోద్వేగాలతో ఈ సినిమాను మరో విజయవంతమైన చిత్రంగా నిలబెడతారని అభిమానులు ఆశిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి అనిల్ మామ ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్ చేరడం ఖాయమంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.